ప్రపంచ పోటీని తట్టుకునేలా అందరం శ్రమిద్దాం

విశాలాంధ్ర-కడప వైవీయూ : ఉన్నత విద్యలో వచ్చే విప్లవాత్మక మార్పులకు తట్టుకొని ప్రపంచ పోటీలో నిలబడేలా విద్యార్థులు అధ్యాపకులు శ్రమించాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య రంగ జనార్దన ఉద్బోధించారు. వైవీయూ 17వ వ్యవస్థాపక, కళాశాల వేడుకల వేదిక డా.ఎ.పి.జే. అబ్దుల్ కలాం సెంట్రల్ లైబ్రరీ ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జింకరంగ జనార్ధన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో మంచి వాతావరణం వనరులు ఉన్నాయి. ప్రణాళికలు అమలు చేసుకుని విద్యార్థులు అత్యున్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. నాణ్యమైన పరిశోధన, బోధన, పరిపాలన వైవీయూలు లభిస్తోందని త్వరలోనే దేశంలోనే నెంబర్ వన్ విశ్వవిద్యాలయంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 17 ఏళ్లు పూర్తి చేసుకుని మైనర్ నుండి మేజర్ కి వెళ్తున్న వైవీయూ అత్యంత శక్తివంతమైన సంస్థగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్పేస్ డిపార్ట్మెంట్ నేషనల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ లాబొరేటరీ డైరెక్టర్ డా.అమిత్ కుమార్ పాత్ర మాట్లాడుతూ విద్యార్థులు ప్రపంచ పోటీని తట్టుకునేలా జ్ఞాన సముపార్జన చేయాలన్నారు. అక్కడ మీకు గా చర్చ జరగాలని, అవి సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వై.పి.వెంకట సుబ్బయ్య గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు అత్యున్నత ఆశయంతో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన దివంగత సీఎం వైఎస్ఆర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. రెండో విడతలోనే న్యాక్ ఏ గ్రేడ్ సాధించిన వైవియు భవిష్యత్తులో ఏ ప్లస్ గ్రేడ్ సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. వైవీయూ ప్రధాన ఆచార్యులు ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం -2020 అమలులో వైవియు అన్ని విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయి, సదస్సులు, కార్యశాలలు నిర్వహించమన్నారు. ఈ కార్యక్రమంలో డీన్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, స్కాలర్లు పాల్గొన్నారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు.

సమష్టి కృషితో నీటి దుర్వినియోగాన్ని అరికడుదాం

విశాలాంధ్ర-వేంపల్లె: వర్షపునీటిని ఒడిసి పట్టడమే కాకుండా నీటి దుర్వినియోగాన్ని సమష్టి కృషితో అరికడదామని ప్రిన్సిప్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు అన్నారు. కడప జిల్లా నెహ్రూ యువ కేంద్ర సహకారంతో స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నీటిని ఒడిసి పట్టుట అనే కార్యక్రమం పైన అవగాహన ఏర్పాటు చేశారు. ఈ అంశం పైన కళాశాలలోని విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర తెలియజేశారు .ముఖ్యఅతిథిగా విచ్చేసిన నెహ్రూ యువకేంద్ర జిల్లా కోఆర్డినేటర్ మణికంఠ నీటిని వడిసి పట్టుట వలన కలిగే ప్రయోజనాలు , ఒడిసి పట్టుటకు ఉన్న పద్ధతులను కులంకషంగా వివరించారు .ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ ఇంటి సమీపంలో ఇంకుడు గుంతలను తవ్వించుకొని మన వంతు బాధ్యతగా నీటిని సంరక్షించుట , రీచార్జ్ చేయుట, నీటి దుర్వినియోగాన్ని అరికట్టవలసిన బాధ్యత మనందరి మీద ఉన్నదని వివరించారు .ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు ప్రతి ఒక్కరూ కూడా నీటిని వడిసి పట్టుట కార్యక్రమంలో ముందుంటామని తెలియజేస్తూ ప్రతిజ్ఞ చేశారు .ఈ కార్యక్రమంలో ఎన్ని సిస్టు ప్రోగ్రాం అధికారి డాక్టర్ మల్లేశ్వరమ్మ ,కంప్యూటర్ విభాగ్యపతి కిరణ్మయి విద్యార్థులు పాల్గొన్నారు.

అల్‌షిఫా వికలాంగుల కేంద్రంలో పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : పాత రిమ్స్ వద్ద ఉన్న అల్‌షిఫా కేంద్రం నందు కమలాపురం శాసనసభ్యులు రవీంద్రనాథ్‌రెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, సోషల్ వెల్ఫేర్ చైర్మన్ ఏపీ సునీల్‌కుమార్, జి. రాజేంద్ర రెడ్డి, జిఎం నమశ్శివాయ, వైవి రమణ ఆశీస్సులతో బి. చంద్రశేఖర్ రెడ్డి, బి. శ్రీలక్ష్మిల కుమార్తె హన్విక చంద్రారెడ్డి పుట్టినరోజు సందర్భంగా అల్‌షిఫా మానసిక వికలాంగుల కేంద్రం నందు ఉన్న శిక్షణ తీసుకుంటున్న మానసిక దివ్యాంగులందరికీ విందు భోజనాన్ని ఏర్పాటు చేసి పిల్లలందరినీ ఆశీర్వదించి స్వీట్స్ కేకులను పంచి పుట్టినరోజు వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బి. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పెద్దల ఆశీర్వాదంతో వారి సహకారంతో వారి ఆశీస్సులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగాఉందన్నారు.ఈ సందర్భంగా నాయకులందరికీ మన స్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు.

ప్రభాకర్‌రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

విశాలాంధ్ర-అట్లూరు : ఇటీవల అనారోగ్యానికి గురై బెంగుళూరు అపోలో హాస్పిటల్‌లో చికిత్స తీసుకొని వేమలూరు గ్రామానికి చెందిన మండల కన్వీనర్ సహకార సంఘం అధ్యక్షుడు మూడమాల ప్రభాకర్‌రెడ్డి బద్వేల్‌లో తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రభాకర్‌రెడ్డిని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గురువారం పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలో వెళ్లి తన సేవలు కొనసాగించాలని అన్నారు. ఎమ్మెల్సీ వెంట బద్వేల్ మాజీ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కరెంట్ రమణారెడ్డి, మన్యంవారిపల్లె గంగిరెడ్డి, అరవరమణారెడ్డి, కామసుందరం మునిరెడ్డి, రమణారెడ్డి, పొన్నవోలు రామమోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

స్నేహితురాలికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర- ఒంటిమిట్ట : కొన్ని నెలల కిందట భర్తను కోల్పోయి పుట్టెడు కష్టాల్లో ఉన్న కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు అందరూ కలిసి ఉడతా భక్తిగా రూ.15వేల ఆర్థిక సహాయాన్ని కొత్తపల్లి లతకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ భవిష్య త్తులో కూడా కుటుంబానికి ఆపద వచ్చిన ఆర్థిక సహాయం చేస్తా మని చిన్ననాటి మిత్రులు (1997- 98 బ్యాచ్) భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిత్రులు రవీంద్రారెడ్డి, హరినాద్ రెడ్డి, కుమార్, రమణ, రాంబాబు, అనిత, నాగమణి, రాజశేఖర్ రెడ్డి, శైలజ తదితరులు ఉన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులను గెలిపించాలి

మాజీ ఎమ్మెల్యే విజయమ్మను కలిసి మద్దతు కోరిన సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

విశాలాంధ్ర-బద్వేల్ : ఈనెల 13న జరుగుతున్న శాసనమండలి ఎన్నికలలో ప్రజా గొంతుకలుగా నిలచి సమస్యలను పరిష్కరించే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు గెలుపు కోరుతూ బద్వేల్ పట్టణంలో సిపిఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల, బిజెఎస్ఆర్ జూనియర్ కళాశాలలో విస్తృత ప్రచార నిర్వహించి మొదటి ప్రాధాన్యత ఓటు వెయ్యాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కోరారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ ఇప్పటికే పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతు ప్రకటించే యోచనలో ఉన్న తరుణంలో బద్వేల్ మాజీ శాసన సభ్యురాలు టీడీపీ నాయకురాలు కొనిరెడ్డి విజయమ్మని కలిసి మద్దతు తెలపవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన ఆరు సంవత్సరాల కాలంలో ఎమ్మెల్సీగా పనిచేసిన కత్తి నరసింహారెడ్డి ఎలాంటి లాభాపేక్ష లేకుండా తనకు వచ్చిన జీతభత్యాలను సైతం లెక్కలు చూపించి ఈ రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యోగ నిరుద్యోగ సమస్యలపై అనేక జీవోలు తీసుకొచ్చి ప్రజల గొంతుకై నిలిచారని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఎమ్మెల్సీ ఎన్నికలలో కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి అయినా గెలవాలని చూస్తున్నదని అధికార పార్టీ వైసీపీ అభ్యర్థులు గెలిస్తే మేధావులు, నిరుద్యోగులు ఓడినట్లేనని డబ్బు రాజకీయాలు చేస్తున్న ఈ అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఇప్పటికే అనేక రూపాలలో తాయిలలు ప్రకటించి ఏదో ఒక విధంగా ఓట్లు దండుకోవాలని ఆలోచించేస్తున్నటువంటి పరిస్థితులలో విజ్ఞులైన మేధావి లోకం ఉద్యోగ ఉపాధ్యాయ నిరుద్యోగులారా మన ఓటు అనే ఆయుధంతో మన కోసం పనిచేసే అభ్యర్థులు గెలిపించుకుందామనిఆయన కోరారు, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న పోతుల నాగరాజు వివాదరహితుడుగా సామాజిక ఉద్యమాల నేతగా సమస్య ఎక్కడున్నా నేనున్నా అంటూ ముందుండే నాగరాజు గారిని గెలిపించడం వల్ల నిరుద్యోగ సమస్యల పైన తన వాని బాని వినిపించడానికి సాధ్యమవుతుందని ఉద్యమాలకు పోరాటాలకు ముందుండే ప్రాంతమని ఉపాధ్యాయ పట్టభద్రుల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.. మాజీ ఎమ్మెల్యే విజయమ్మ గారితో మాట్లాడు సందర్భంలో ఈరోజు రేపు మాకు సరైన గైడెన్స్ వస్తాయని మా అధినేత నిర్ణయం మేరకు మీకుసహకారం ఇస్తామని చెప్పిందన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఆయనతో పాటు సిపిఐ ప్రజాసంఘాల నాయకులు.. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, వీరశేఖర్ జకరయ్య, చంద్రమోహన్ రాజు, బాలు పడిగే వెంకటరమణ, పివి రమణ, జివిల్ నరసింహ, పెంచలయ్య, ఇమ్మానియేల్, ఆర్ శీను, నాగసుబ్బయ్య, కాకి మల్ల, సుబ్బరాయుడు,ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి అశోక్, సుబ్బారెడ్డి, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో బీరం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - చెన్నూరు : ప్రకృతి ఒడిలో నెలకొల్పబడిన బీరం శ్రీధర్ రెడ్డి విద్యాసంస్థల విద్యార్థులు సబ్ జూనియర్ త్రోబాల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో అత్యున్నత ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా అసోసియేషన్ తరపున 8వ తేదీ నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ త్రోబాల్ బాలుర విభాగంలో బీరం శ్రీధర్ రెడ్డి విద్యాసంస్థల్లో 9వ తరగతి చదువుతున్న సి.గంగిరెడ్డి, ఎ.దినాకర్ రెడ్డి, పి.సందీప్ రెడ్డి,జి.సుమంత్ రెడ్డిలు విజయం సాధించి జాతీయస్థాయికి ఎంపిక అయ్యారని తెలిపారు. గెలుపు సాధించిన క్రీడాకారులు ఈనెల 28 నుండి 30వ తేదీ వరకు చత్తీస్గఢ్ రాష్ట్రంలోని బిలాయి లో జరిగే 30 వ జాతీయస్థాయి సబ్ జూనియర్ త్రోబాల్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పాల్గొంటారని తెలిపారు.తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో త్రోబాల్ పోటీల్లో పాల్గొని బీరం విద్యాసంస్థల పేరును, జిల్లా పేరును, రాష్ట్రస్థాయిలో ఉన్నతంగా నిలబెట్టారని, అదేవిధంగా జాతీయస్థాయి పోటీల్లో కూడా పాల్గొని గెలుపు సాధించి బీరం విద్యా సంస్థల కీర్తిప్రతాకాన్ని జాతీయ స్థాయిలో ఎగురవేయాలని వారు ఆకాంక్షించారు. విద్యాసంస్థల విద్యార్థులు క్రీడల్లోనైనా, చదువులో అయినా విజయానికి చిరునామా అని తెలియజేశారు. విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా జాతీయస్థాయిలో తప్పకుండా విజయం సాధిస్తారని వారు తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. విద్యా సంస్థల చైర్ పర్సన్ సరస్వతమ్మ డైరెక్టర్ స్వాతిశ్రీకాంత్, ప్రిన్సిపల్ శ్వేతాలు విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పి. ఇ.టి,ఎ.సురేష్ ను విద్యార్థులను అభినందించారు.

భూహక్కు-భూరక్షణ పథకంపై సమీక్ష

విశాలాంధ్ర-పులివెందుల టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం భూహక్కు- భూరక్షణ పథ కంపై మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డి సమీక్షించారు. సెక్రెటరీ లు సమన్వయం తో పనిచేసి పథకం విజయ వంతానికి కృషి చేయాలని సూచించారు. అలాగే ఆస్తి పన్ను వసూల్లు సచివాలయం పరంగా నూరు శాతం వసూలుకు శ్రమించాలి అన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లకు చెల్లించాల్సిన మొత్తాలను సచివాలయం వాలంటరీ ద్వారా గుర్తించి వారితో త్వరగా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడ్మిన్‌ప్లానింగ్, వేల్ఫేర్ సెక్రటరీలు టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్ కుమార్ మునిసిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ రఘునాథ రెడ్డి మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భూ తగాదాలలో వైసీపీ నాయకులకు తీవ్రగాయాలు

దాడి చేసిన 11మందిపై కేసు నమోదు

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: వైఎస్ఆర్ జిల్లా బ్రహ్మంగారి మఠం మండలంలోని జి.నరసింహాపురం పొలంలో భూ సమస్యతో గొడవ పడి వైసీపీ నాయకులను కారంపొడి, కర్రలతో చితకబాదిన భూ బాధితులు. చౌదరవారిపల్లె రెవెన్యూ పొలం గుండాలపురం గ్రామంలో సర్వే నెం.340లో 1.93సెంట్లు మత్తల సిద్ధయ్య అనే వ్యక్తి పొలం ఉంది. ప్రక్కనే 281 సర్వే నెంబర్‌లో భైరి అచ్చమ్మ అనే పేరుమీద 2.81విస్తీర్ణంలో భూమి ఉండేది. బైరి అచ్చమ్మ పొలం సాగులో లేకపోవడంతో బత్తల సిద్ధయ్య తమ పొలం కాకుండా 1.56విస్తీర్ణం అదనంగా సాగు చేసుకోవడం జరిగింది. ప్రభుత్వం చేపట్టి భూ రికార్డును సర్వేలో బైరి అచ్చమ్మ పొలం హద్దులు కేటాయించడం జరిగింది. ఆనాటి నుండి ఈ భూ సమస్యలు మొదలైంది. బత్తుల సిద్ధయ్య పొలం నాది అంటూ అడ్డు తిరగడంతో చుట్టుప్రక్కల గ్రామాల పెద్ద మనుషులు పంచాయతీ చేసి ఇరువురికి చెప్పడం జరిగింది. గురువారం ఉదయం బైరి అచ్చమ్మ కుటుంబసభ్యులు తమ పొలం చుట్టూ కంచె ఏర్పాటు చేసుకునేందుకు వెళ్లగా బత్తల సిద్ధయ్య కుటుంబీకులు బైరి అచ్చమ్మ కుటుంబీకులను కారంపొడి, రాళ్లు, కర్రలతో నడిరోడ్డుపై విచక్షణ రహితంగా పెద్ద మనుషులుగా వెళ్లినటువంటి వైసీపీ నాయకులను సైతం కళ్లల్లో కారం చల్లి కొట్టడం జరిగింది. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ విద్యాసాగర్, మైదుకూరు రూరల్ సీఐ నరేందర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని గొడవ జరిగిన తీరును విచారణ చేసి గొడవకు పాల్పడిన 11మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. గొడవలో గాయపడిన వారిని కూడ దాడి చేసిన వారి ఇళ్లపై దాడికి ప్రయత్నించినట్లు సమాచారం తెలిసింది. పోలీసులు చెదరగొట్టి గాయపడిని వారిని ఆసుపత్రికి తరలించినట్లుగా బ్రహ్మంగారి మఠంలోని ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్సచేసి అనంతరం మెరుగైన వైద్యం కొరకు కడప రిమ్స్‌కు తరలించారు.

వైకాపా జోనల్ అధ్యక్షురాలిగా రత్నకుమారి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : వైకాపా మహిళా విభాగం జోనల్ అధ్యక్షు రాలిగా ఎంకే రత్నకుమారిని నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యా లయం నుంచి ఉత్తర్వులు అందాయి. కడప నగరానికి చెందిన రత్నకుమారి దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమానిగా ఉంటూ కాంగ్రెస్ పార్టీలో పలు నామినేటెడ్ పదవుల్లో పనిచేశారు. కడప మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా పనిచేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పార్టీ ఏర్పాటైనప్పటి నుంచి పార్టీలో చురుకైన కార్యకర్తగా పని చేస్తున్న నేపథ్యంలో ఆమెకు పార్టీలో జోనల్ అధ్యక్షురాలిగా నియమించారు. తన నియామకానికి కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, ఉపముఖ్యమంత్రి అంజద్ బాష, కడప ఎంపీ అవినాష్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

శునకాలతో బెంబేలు

- చోదకుల వెంట పడుతున్న కుక్కలు
- రహదారులపై పశువులు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఎర్రగుంట్ల పురపాలిక పరిధిలో శునకాల బెడద ఎక్కువైందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటి సంతతిని నియంత్రించకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ సంచరిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. పట్టణంలోని 20 మున్సిపల్ కౌన్సిల్ వార్డుల పరిధిలో ఎటు చూసినా అధిక సంఖ్యలో వీధికుక్కలు సంచరిస్తున్నాయి. ద్విచక్రవాహనాలపై వెళ్లే వారిని వెంబడిస్తూ వారిని ప్రమాదాల బారిన పడేలా చేస్తున్నాయి. పురపాలిక యంత్రాంగం అప్పుడప్పుడు కుక్కలను పట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు చెబుతున్నారే తప్ప స్థానికంగా ఉండే వీటిసంతతిని నియంత్రించే చర్యలకు ఉపక్రమించడం లేదన్న విమర్శ ఉంది. వేసవికాలం వచ్చేయడంతో వీటికి ఆహారం, నీరు దొరకడం కరువైంది. దీంతో శునకాలలో అసహనం పెరిగి ప్రజలపై దాడులకు తెగబడుతున్నాయి. ముఖ్యంగా వీధులలో ఆటలాడుకునే చిన్నారులపై వీటి ప్రభావం అధికంగా ఉంది.అలాగే వృద్ధులపై దాడులకు ప్రయత్నిస్తున్నాయి. పట్టణ శివారు ప్రాంతాలైన ఎర్రబ్బిచేలు, వడ్డెరకాలనీ, సుందరయ్యనగర్, ప్రకాశ్‌నగర్, రాణివనం, క్రాంతినగర్ వంటి ప్రాంతాల్లో వీటి సంచారం అధికంగా కనిపిస్తోంది. వీటితో పాటు పందులు సైతం లెక్కకు మించి సంచరిస్తున్నాయి. కుక్కలు, పందుల మధ్య జాతివైరంతో కొట్లాడుకుంటున్న సందర్భాలలో అవి రోడ్డుకు అడ్డంగా వచ్చి పాదాచారులు, ద్విచక్రవాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. పట్టణంలో కుక్కకాటుకు గురై వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించే వారి సంఖ్య కూడా అధికంగానే ఉన్నట్లు తెలుస్తోంది. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలైన పోట్లదుర్తి, చిలమకూరు గ్రామాల్లో నిరుపేదలు నివసించే ప్రాంతాల్లో పందులు, కుక్కల సంచారం అధికంగా ఉన్నట్లు ప్రజలు గుర్తుచేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎర్రగుంట్ల పురపాలిక పరిధిలో పశు పోషకులు తమ ఆవులను రోడ్లపై వదిలేయడంతో వీటి కారణంగా అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇవి ద్విచక్రవాహనాలకు అడ్డంగా వస్తూ వారిని ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. అంతేకాకుండా నిలిచి ఉన్న వాహనాల సైడు బ్యాగులను నోటితో శోదిస్తూ అందులో ఉంచిన వస్తువులను కిందకు లాగి పడేయడం మనం ప్రత్యక్షంగా చూడవచ్చు. వాటికి అసహనం కలిగినప్పుడు సదరు వాహనాలను కిందకు తోసేయడం కనిపిస్తుంది. ఇంత జరుగుతున్నా పురపాలిక యంత్రాంగం కుక్కలు, పందులు, ఆవులను నియంత్రించే చర్యలకు ఉపక్రమించకపోవడం పట్ల పురప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పన్నులను ముక్కుపిండి వసూలు చేస్తున్న పురపాలిక యంత్రాంగం పట్టణ ప్రజలకు అవరోధంగా మారిన వీటిని ఎందుకు నియంత్రించలేకపోతున్నారో బోధపడడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటి నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

నాగార్జున మోడల్ స్కూల్లో ఘనంగా క్రీడాదినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్లో 09.03.2023న స్పోర్ట్స్ బజ్-2023 పేరిట జరిగిన క్రీడాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప స్టెప్ సీఈఓ సి. సాయి గ్రేస్ హాజరయ్యారు. ప్రార్థనాగీతంతో కార్యక్రమం ప్రారంభమైనది. జాతీయ పతాకాన్ని నాగార్జున విద్యాసం స్థల డైరెక్టర్ శ్రీదేవి క్రీడా పతాకాన్ని ముఖ్యఅతిథి సాయి గ్రేస్ ఆవిష్కరించారు. అనంతరం క్రీడల్లో పాల్గొన్న పిల్లలచే ముఖ్య అతిథి గౌరవవందనం స్వీకరించారు. ఒలింపిక్స్ తరహాలో క్రీడాజ్యోతిని రిలే పద్ధతిలో జాతీయస్థాయిలో ఫుట్బాల్ మరియు బాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న గృహిత, భార్గవ్, మహిత, సాయి పార్థివ్, శివ పల్లవి, శివశంకరిల ద్వారా ముఖ్యఅతిథికి అందజేశారు. తదనంతరం క్రీడాజ్యోతి ప్రజ్వలనంతో క్రీడల పోటీలు ప్రారంభమయ్యాయి. స్పోర్ట్స్ డే ప్రారంభ సూచకంగా ముఖ్యఅతిథి, చైర్మన్, డైరెక్టర్ ప్రిన్సిపాల్లు పావురాలను గాలిలోకి ఎగురవేశారు. తర్వాత పిల్లలకు వివిధ క్రీడల పోటీలు నిర్వహించి విజేతలను సత్కరించారు. సభకు అధ్యక్షత వహించిన నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ యం. శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ "క్రీడల్లో పాల్గొనడం వల్ల పిల్లలకు మానసిక వికాసంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, జవాబుదారీతనం వంటి లక్షణాలు అలవడతాయనీ, జీవితంలో కూడా పోటీతత్వం ఏర్పడుతుందనీ అం దుకే ప్రతిసంవత్సరం ఈ క్రీడాది నోత్సవాన్ని నిర్వహించి వారిలో మానసికోల్లాసంతో పాటు, క్రీడలపై ఆసక్తి పెంచడానికి కృషిచేస్తున్నామన్నారు." ముఖ్య అతిథి సాయి గ్రేస్ సభనుద్దేశించి ఉపన్యసిస్తూ "విద్యార్థి జీవితంలో క్రీడలు ఒక భాగం కావాలనీ, శారీరక దృఢత్వం ఉంటేనే ఏమైన సాధించగలమన్నారు. ప్రతి రోజు పాఠశాలలో ఆటలు ఆడుతూ ఉండాలని, ఆసక్తి పెంచుకుంటే ఎంతటి కష్టమైన ఆటనైన త్వరగా నేర్చుకోవచ్చు న్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు క్రీడలవైపు ప్రోత్సాహించాలని ఉద్బోధించారు. ఎంతో శ్రమకోర్చి ప్రతి సంవత్సరం క్రీడాదినోత్సవాన్ని నిర్వహించి పిల్లలలో అవగాహన, ఆసక్తి, ఉత్సాహం కలిగిస్తున్న పాఠశాల యాజమాన్యం కృషి అభినందనీ యమనీ" కొనియాడారు. ముఖ్యఅతిథి విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలన్నీ ఆసాంతం తిలకించి చిన్నారుల ప్రతిభను మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీదేవి, నాగార్జున మోడల్ స్కూల్ డీన్ కులాయప్ప పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడంలో వ్యాయామ ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందం యొక్క కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో వుందని వారికి యాజమాన్యం తమ కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

సమష్టి కృషితో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి, కలెక్టర్ విజయరామరాజు

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : టీటీడీలోని అన్ని విభాగాలు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమష్టి కృషి చేసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి అధికారులను కోరారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వైసీపీ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్పీ అన్బురాజన్, జిల్లా యంత్రాంగంతో గురువారం ఒంటిమిట్టలో ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ గతంలో జరిగిన లోటుపాట్లను సవరించుకుని సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవ ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 16వ తేదీ మరోసారి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించనున్నట్లు ఈవో వివరించారు. మార్చి 30వ తేదీ శ్రీరామనవమితో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఏప్రిల్ 3వ తేదీ హనుమంత వాహనం, ఏప్రిల్ 4వ తేదీ గరుడవాహనం, ఏప్రిల్ 5వ తేదీ సీతారాముల కల్యాణాన్ని అత్యంత అద్భుతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఏప్రిల్ 6న రథోత్సవము, ఏప్రిల్ 7న చక్రస్నానం, ఏప్రిల్ 8న పుష్పయాగము జరుగుతాయని చెప్పారు. వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. అంతకుముందు టీటీడీ ఈవో, జిల్లా కలెక్టర్ తో కలిసి కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో శ్రీ వీర బ్రహ్మం, జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ, ఎస్వీబీసీ సిఈవో షణ్ముఖ కుమార్, టీటీడీ సిఈ నాగేశ్వరరావు జిల్లా యంత్రాంగానికి చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్‌ఫేర్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ప్రశ్నించే తత్వం విద్యార్థులు అలవర్చుకోవాలని జిల్లా సైన్సు అధికారి బి. మహేశ్వర్ రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక అక్షర స్కూల్లో నేడు కలాం ఫైర్ బర్డ్స్ పేరుతో సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ పురోగతిలో శాస్త్ర విజ్ఞానం ముఖ్య భూమిక పోషించిందని కొనియాడారు. సమాజం ఎదుర్కొంటున్న అనేక క్లిష్టమైన సమస్యలకు పరిష్కారం సైన్స్ చూపుతోందని ఆయన తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన అన్ని ప్రాజెక్టులను వారు తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం. లలితమ్మ, డైరెక్టర్ సి బాబు, అధ్యాపకులు గౌతమి, సుమతి, రాజేష్, కశ్యప్, మురళీధర్, స్వరూప, ప్రవల్లిక, మౌనిక, ప్రసన్న పాల్గొన్నారు. వీరితో పాటు ఆక్స్‌ఫర్డ్ స్కూల్ మెసేజ్ బాబు, న్యూ హరిజన్ స్కూల్ రమేష్ రెడ్డి, మధుసూదనా స్కూల్ కరస్పాండెంట్ వంశీ, నలంద హై స్కూల్ కరస్పాండెంట్ వెంకటసుబ్బయ్య, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేస్తాం

రాష్ట్ర హౌసింగ్‌బోర్డు డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : రాష్ట్ర నలుమూలల నుంచి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ప్రతి రోజు 15 వేల మందికి అన్నప్రసాదం ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర హౌసింగ్ బోర్డు డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. గురువారం కోదండరామాలయ వెనుకభాగాన ఉన్న ఖాళీ ప్రదేశాన్ని పరిశీలించారు. గత సంవత్సరం ఏర్పాటు చేసిన స్థానంలోనే ఈ సంవత్సరం కూడా ఏర్పాటుచేస్తామని ఆయన తెలిపారు. శ్రీరామనవమి మొదటి రోజు నుంచి రథోత్సవం వరకు దాదాపుగా లక్ష మందికి అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చు భక్తులు ఈ అన్నప్రసాదాన్ని స్వీకరించాలని ఆయన భక్తులను కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువ నాయకులు ముమ్మడి శ్రీధర్‌రెడ్డి, గంగపేరూరు సర్పంచ్ ప్రతినిధి కూండ్ల ఓబుల్‌రెడ్డి, కొండమాచుపల్లె సర్పంచ్ శివనారాయణ, గంగపేరూరు గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, పాలెం రవిశంకర్‌రెడ్డి, పెద్ద ఎత్తున వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్షనర్ల డిమాండ్లను పరిష్కరించాలి

విశాలాంధ్ర- కడప : రాష్ట్ర ప్రభుత్వం పెన్ష నర్ల సంఘం సూచనల మేరకు కడప జిల్లా పెన్ష నర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామ్మూర్తి నాయు డు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తమ డిమాండ్ల సాధనకై 9 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి, తాహసీల్దార్ కార్యాలయం లో వినతిపత్రం సమర్పించారు. న్యాయమైన డిమా ండ్లను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించి పెన్షనర్ల జీవితాలలో వెలుగు లు నింపాలని కోరారు. అనంతరం పెన్షనర్ల సంఘం చీఫ్ అడ్వైజర్‌గా ఎస్వి సుబ్బారావును వారి స్వగృహంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు డ్రిల్‌మాస్టర్ సుబ్బరాయుడు, రెడ్డయ్య, వాసుదేవరెడ్డి, సత్యరాజు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా



తెలంగాణ హైకోర్టులో ఎంపీ అవినాష్‌రెడ్డి రిట్ పిటిషన్ దాఖలు

విశాలాంధ్ర-పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి గురువారం తెలంగాణ హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. పిటిషన్‌లోని వివరాలిలావున్నాయి. వివేకా హత్య కేసులో సీబీఐ తనను విచారించే సమయంలో ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలని పిటిషన్‌లో కోరిన అవినాష్‌రెడ్డి. తన న్యాయవాది సమక్షంలోనే విచారణ చేయాలని 160 సిఆర్‌పిసి నోటీస్ ఇచ్చారు కాబట్టి సీబీఐ ఎలాంటి బలవంతపు ,చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరిన అవినాష్‌రెడ్డి, వివేకా హత్య కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న దస్తగిరిని ఇప్పటివరకు సీబీఐ అరెస్ట్ చేయలేదు. దస్తగిరి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కూడా సీబీఐ ఎక్కడా వ్యతిరేకించలేదు. దస్తగిరి అక్కడ ఇక్కడ విని చెప్పిన మాటల ఆధారంగానే సీబీఐ విచారణ కొనసాగుతోంది.నాకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లేకపోయినప్పటికీ.ఈ కేసులో నన్ను ఇరికించే ప్రయత్నం జరుగుతోంది. వివేకా హత్య కేసులో దర్యాప్తు అధికారి పనితీరు పక్షపాతంగా ఉంది. వివేకా హత్య ఎలా జరిగిందో ముందుగానే నిర్ణయించుకుని అదే కోణంలో విచారణ చేస్తున్నారు. సాక్ష్యాలు చెప్పేలా విచారణాధికారి కొందరిపై ఒత్తిడి తెస్తున్నారు. నేను విచారణలో చెప్పిన విషయాలను కూడా విచారణ అధికారి మార్చేస్తున్నారు. నాకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లేనప్పటికీ ఈ కేసులో నన్ను ఇరికించే ప్రయత్నం జరుగుతోంది. వివేకా హత్య కేసులో దర్యాప్తు అధికారి తీరు పారదర్శకంగా లేదు. పై విషయాలన్న అవినాష్‌రెడ్డి పిటిషన్‌లో కోర్టుకు వివరించినట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్సీ ఎన్నికలపై వైసీపీ సమీక్ష

విశాలాంధ్ర-యర్రగుంట్ల : పట్టభద్రుల, ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలకు సంబందించి ఈ నెల 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అధికార వైసీపీ జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ సురేష్‌బాబు గురువారం ఇక్కడికి చేరుకొని స్థానిక పార్టీ కార్యాలయంలో సమీక్షించారు. మండల పార్టీ బాధ్యులు సురేంద్రారెడ్డి, రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తదితరులతో ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించారు. పోలింగ్ సరళి, కేంద్రాల వద్ద ఏర్పాట్లపై కూడా వారు సమావేశంలో చర్చించుకున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు దాసరి సూర్య నారాయణరెడ్డితో పాటు పలువురు ఉన్నారు.

చౌడమ్మ వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర-కడప రూరల్ : నగరంలోని స్థానిక చౌడమ్మ వృద్దా శ్రమంలో అన్నదాన కార్యక్ర మం ఘనంగా నిర్వహిం చారు. వైఎస్ఆర్‌సీపీ సీనియ ర్ కార్యకర్త వై.ప్రేమ్‌కుమార్ కుమారుడు యనమల వెంకటసంజయ్ పుట్టినరోజు సందర్భం గా ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథి గా వైసీపీ సిటీ సెక్రటరీ బక్కా శ్యామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బక్కా శ్యామ్ మాట్లాడుతూ వెంకటసంజయ్ తన పుట్టినరోజును వృద్దాశ్రమంలోని వృద్దుల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వృద్దులు, వెంకటసంజయ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్షయరోగులకు పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర-తొండూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం క్షయరోగులకు పౌష్టికాహా రం కిట్లు పంపిణీ చేశారు. విశ్రాంత ఉద్యోగులు ఈశ్వరమ్మ, సుబ్బారెడ్డి దంప తుల సహకారంతో ఈ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రేష్మా మాట్లాడుతూ క్షయరోగులు పౌష్టికాహం తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుందన్నారు. మందులతో పాటు అదనపు ఆహారం కూడా క్షయరోగులకు ఎంతో అవసరమని రేష్మా వెల్లడించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రమణమ్మ, హెల్త్‌ఎడ్యుకేటర్ మల్లయ్య, సూపర్‌వైజర్ నాగ్లానాయక్, టిబిహెచ్‌వి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గర్భవతులకు బిస్కెట్లు పంపిణీ

విశాలాంధ్ర-పులివెందుల: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం మానవత సంస్థ ఆధ్వర్యంలో గర్భవతులకు బిస్కెట్లతో పాటు బ్రెడ్డు పంపిణీ చేశారు. మానవత గౌరవ కుటుంబ సభ్యులు, విశ్రాంత అధ్యాపకులు గోపాల్‌రెడ్డి ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు మానవత సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధి కారి లక్ష్మిప్రియ, సిబ్బంది మానవత చైర్మన్ కొండారెడ్డి, ట్రెజరర్ బండి హరిశ్చంద్రారెడ్డి, మానవత డైరెక్టర్లు అ. సదాశివా రెడ్డి, చంద్ర శేఖర రెడ్డి, అశ్వర్థ నారాయణరెడ్డి, శివరామ రెడ్డి, నాగేశ్వరరెడ్డి, సుబ్రమణ్యము, రంగారెడ్డి పాల్గొన్నారు.

ఏపీ కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షునిగా గడేకుల వెంకటరమణ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ కాపు సంక్షేమ సేన కడప జిల్లా అధ్యక్షునిగా కడప నగరానికి చెందిన గడేకుల వెంకటరమణను నియమిస్తూ ఏపీ కాపు సంక్షేమ సేన రాష్ట్ర అధ్యక్షులు హరి రామ జోగయ్య ఉత్తర్వులను జారీ చేశారు. జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా బలిజ కాపు కులాల సంక్షేమం కోసం గత ఐదు సంవత్సరముల నుంచి విశేషంగా కృషి చేసినందుకు వెంకటరమణను జిల్లా అధ్యక్షునిగా నియమించినట్లు ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా గడేకుల వెంకటరమణ మాట్లాడుతూ కాపు సంక్షేమ సేన సిద్ధాంతాలకు నిబద్ధతకు లోబడి బలిజ కాపు తెలగ ఒంటరి కులాల సంక్షేమం కోసం మరియు విద్య వైద్య ఆర్థిక రాజకీయ వ్యాపార తదితర రంగాలలో వారి అభివృద్ధి కోసం నా శాయశక్తుల నిరంతరం కృషి చేస్తానని ఆయన ఈ సందర్భం గా తెలియజేశారు. ఈయన నియామకానికి సహకరించిన అన్నమయ్య కడప ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు మస్తాన్ రాయలు, పారిశ్రామికవేత్త సుబ్బారావు, అక్కిసెట్టి శ్రీనివాసులు తదితర నాయకులు కార్యకర్తలకు స్నేహితులకు కులస్తులకు ఆయన అభినందలు తెలియజేశారు.

ఏప్రిల్ 5న సీతారాముల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : అత్యంత చారిత్రాత్మక ప్రాశస్త్యం ఉన్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో ఏప్రిల్ 5న జరిగే శ్రీ సీతారాముల కళ్యాణానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక టిటిడి కళ్యాణ మండపం సమీపంలోని పరిపాలన భవనం సమావేశపు హాలులో... టీటీడీ ఈవో ధర్మా రెడ్డి, ఎస్పీ అన్బురాజన్, జేసీ సీఎం సాయికాంత్ వర్మ, టీటీడీ జెఈఓ వీరబ్రహ్మం, డిఆర్వో గంగాధర్ గౌడ్ లతో కలిసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులు, టీటీడీ అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 30వ తేదీ నుండి ఏప్రిల్ 9వ తేదీ వరకు శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయన్నారు. ఎప్రిల్ 5వ తేదీన జరిగే కళ్యాణోత్సవానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి వచ్చే అవకాశం ఉన్నందున.. పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు ప్రముఖులు, అత్యంత ప్రముఖులు రావచ్చనే అంచనాతో అన్ని రకాల ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఆ మేరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా, టీటీడీ, పోలీస్ అధికారులు సంయుక్తంగా, నిర్దిష్ట ప్రణాళికలతో విధులను నిర్వర్తించాలన్నారు. కడప, రాజంపేట వైపు నుంచే ఆర్టీసీ బస్సులకు పార్కింగ్, అలాగే ఇతర జిల్లాలనుంచి ఎన్ని బస్సులు వస్తున్నాయో తెలుసుకుని పక్కాగా ప్లాన్ రూపొందించుకుని పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఒకవేళ పార్కింగ్ దూరంగా ఉంటే అక్కడి నుంచి కళ్యాణవేదిక వద్దకు భక్తులను తీసుకువచ్చేందుకు ఉచిత బస్సులను ఏర్పాటు చేయాలని టిటిడి ఈవో ధర్మా రెడ్డికి తెలిపారు. టీటీడీ ఈవో ధర్మా రెడ్డి మాట్లాడుతూ.. టిటిడిలోని అన్ని విభాగాలు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమిష్టి కృషి చేసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలను విజయ వంతం చేయాలని టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి అధికారులను కోరారు. ఈ ఏడాది కోదండరామ స్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను విజయవం తం చేసేందుకు టిటిడి తరపున సంపూర్ణ సహకారా లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో ధర్మచంద్రా రెడ్డి, ఓఎస్డీ రఘునాథ్, డ్వామా, డిఆర్డీఏ పీడిలు యదుభూషన్ రెడ్డి, ఆనంద్ నాయక్, డీఎస్పీ శివారెడ్డి, వ్యవసాయ శాఖ జేడి నాగేశ్వరరావు, సమగ్ర శిక్ష ఏపిసి ప్రభాకర్ రెడ్డి, డిఎంహెచ్‌ఓ డా. నాగరాజు, సిపివో వెంకటరావు, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, జెడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఏపిఎస్పిడిసిఎల్ ఎస్ఈ ముని శంకరయ్య, డిటిసి మీరాప్రసాద్, ఆర్టీసీ ఆర్ఎం ప్రసాద్ రెడ్డి, టిటిడి పిఆర్వో రవి, సమాచార శాఖ ఏడి వేణుగోపాల్ రెడ్డి, ప్రత్యేక ప్రతిభావంతుల శాఖ ఏడి కృష్ణ కిషోర్, ఏపీఎంఐపి పీడి రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థిని బలపరచండి

విశాలాంధ్ర - వల్లూరు : పశ్చిమ రాయలసీమ పట్ట భద్రుల తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపా ల్ రెడ్డి గెలుపుకై తెలుగుదేశం పార్టీ వల్లూరు మండలం టిడిపి అధ్యక్షుడు లేబాక నాగేశ్వర్ రెడ్డి ముమ్మరంగా ప్రచారం నిర్వహించామన్నారు. గురువారం మండల కేంద్రంలోని పైడికాలువ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ తరఫున పశ్చిమ రాయలసీమ పట్టభద్రుడు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా మార్చి 13న జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గ్రాడ్యుయేట్ అభ్యర్థులను కోరారు. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఆకుల శ్రీనివాసులు, సుమంత్, కేశవరెడ్డి, రాఘవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఎస్సీసెల్ దర్శ వెంకటసుబ్బరాయుడు, రామచంద్రారెడ్డి, యూనిట్ ఇంచార్జ్ మదన్ మోహన్ రెడ్డి, రమణారెడ్డి, ఓబులేష్ యాదవ్, అబ్దుల్ రసూల్, మాధవరెడ్డి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూమిరెడ్డి రామ గోపాల్ రెడ్డిని గెలిపించండి

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ టీటీడి మాజీ చైర్మన్ పుట్టా సుధా కర్ యాదవ్ ఆదేశాల మేరకు మైదుకూరు మున్సి పాలిటీ లోని 6 వ వార్డు నందు రాకెట్ రఫీ ఇంటింటికి ప్రచారం చేస్తూ మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటును వేసి వేయించి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిని గెలిపించాలని శాసనమండలి అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్స్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంఛార్జి పాశం మారుతి, పార్లమెంట్ కార్యదర్శి షరీఫ్, ధనపాల రవి, మున్సిపాలిటీ మైనార్టీ అధ్యక్షులు పాల మాబు, తెలుగుయువత పట్టణ అధ్యక్షులు ముడియం ప్రసాద్,3 వార్డ్ ప్రభాకర్,షరీఫ్, పార్లిమెంట్ అధికార ప్రతినిధి అల్తాఫ్ హుస్సేన్, మైనారిటీ కార్యదర్శి గౌస్ బండి అమర్నాథ్, కమాల్ బాషా, మహబూబ్ బాషా, తుపాకుల రమణ తుపాకుల సుబ్బారావు మరియు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను వెంటనే విడుదల చేయాలని వినతి

విశాలాంధ్ర-బద్వేల్ : ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు రావల సిన బకాయిలు వెంట నే విడుదల చేయాలని బకాయి పడ్డ రెండు డిఎలను విడుదలకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం పిలుపుమేరకు బద్వేల్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ డి.మీనాక్షి రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నాడు బద్వేల్ రెవిన్యూ డివిజన్ అధికారి తాసిల్దారు వారికి ఖజానా శాఖ అధికారికి వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ డి.మీనాక్షి రెడ్డి మాట్లాడుతూ విశ్రాంతి ఉద్యోగులకు ప్రతి నెల ఒకటి తేదీన పెన్షన్ విధంగా చర్యలు తీసుకోవాలని రెండు డిఎలు విడుదలకు వెంటనే చర్యలు చేపట్టాలని విశ్రాంతి ఉద్యోగులకు రావలసిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర సంఘ మేరకు అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, కోశాధికారి గంగన్న, అసోసియేట్ ప్రెసిడెంట్ గంజికుంట పుల్లయ్య, గౌరవ సలహాలు గడి పుల్లంరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ముండ్లపాటి పిచ్చయ్య, ఉపాధ్యక్షులు ఆనందరావు, ప్రసాద్, రామ సుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, చిన్న రాయుడు, సుబ్బరాయుడు, మహబూబాషా, నరసరాజు, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టరు శరణ్యరెడ్డికి ఘన సన్మానం

విశాలాంధ్ర-పులివెందుల: స్థానిక ఆహార విజ్ఞానశాస్త్ర సాంకేతిక కళాశాలలో గురువారం ప్రముఖ గైనకాలజిస్టు శరణ్య రెడ్డికి ఘన సన్మానం లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని కళాశాల ప్రిన్సిపల్ బేగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నేటి సమాజంలో స్త్రీ పురుషుల అసమానతల గురించి శరణ్యరెడ్డి వివరించారు. స్త్రీలను ఎలా గౌరవించాలో అన్న అంశాన్ని ఆమె విపులంగా విశదీకరించారు. గైనకాలజిస్టు పరంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారం తదితర అంశాలను వివరించారు. కాగా తాను చదివిన కళాశాలలో మహిళా దినోత్సవం రోజున ముఖ్యఅతిథిగా ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉందని పూర్వపు విద్యార్థిని స్వప్న ఈ సందర్భంగా వెల్లడించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అరుణ, రాజేష్, జయమ్మ, నజ్మ, నివేదిత, సాయిశ్రీనివాస్, రాజశేఖర్, రామిరెడ్డి, పావనదప్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఆర్టీపీపీకి గురువారం విచ్చేసిన బీజేపీ జాతీయ కార్య దర్శి వై.సత్యకుమార్‌ను రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రం రీజనల్ జేఏసీ నాయకులు కలి శారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు సత్యకుమార్‌కు ఓ వినతిపత్రం అందజేశారు. 2019 ఎన్నికల సమయంలో అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీ నేటికీ నెరవేర్చలేదని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆ వినతిపత్రంలో వివరించారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు గడిచినా ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో పాటు అర్ధరూపాయి వేతనాన్ని సైతం పెంచలేదని గుర్తుచేశారు. తమరు తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. దీంతో స్పందించిన సత్యకుమార్ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని హామీ ఇచ్చినట్లు జేఏసీ నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు రాము, దేవప్రేమ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గాల వారి సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు చేపడతామనీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారు మూడి విక్టర్ ప్రసాద్ అన్నా రు. గురువారం ఈ సందర్భంగా ఆయన జిల్లాలో పర్యటన భాగంగా పులివెందుల వైసీపీ ఎస్సీ నాయకులు కోల ప్రసాద్ ఆధ్వర్యంలో కడప పర్యటనకు వచ్చిన ఎస్సీ కమిషన్ చైర్మన్ మూడు ముడి విక్టర్ ప్రసాద్ కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కడప నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహానికి చేరుకున్న విక్టర్ ప్రసాద్‌కు ఎస్సీ ఎస్టీ సంఘాల నేతలు ఘన స్వాతం పలికారు. అంతకుముందు ఆయన కడప నగరం ఆర్టీసీ బస్టాండు వద్దగల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అలాగే ఆయన ఆయా సామాజిక వర్గాలకు చెందిన సంస్థలు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఈ సందర్భంగా పైన మీడియాతో మాట్లాడుతూ తాము స్వీకరించిన అర్జీలపై సత్వరమే తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించడం జరుగుతుందని తెలిపారు. తాను బాధ్య తలు చేపట్టినప్పటి నుంచి సమస్యలు ఉన్న ప్రజలకు తగిన న్యాయం జరిగేలా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహ న్ రెడ్డి తనకు కల్పించిన స్వేచ్ఛ కారణంగా పార్టీలు, వర్గాలకు అతీతంగా బాధిత ప్రజలకు తగిన న్యాయం చేయడమే లక్ష్యంగా ఎస్సీ కమిషన్ కృషి చేస్తున్నదని ఆయన వివరించారు. రానున్న కాలంలో దళిత వర్గాలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకు వస్తే వాటి పరిష్కారానికి తమవంతుగా కృషి చేయడం జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమలో వైస్సార్సీపీ యస్సి సెల్ జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్, వైయస్సార్‌టియుసి జిల్లా అధ్యక్షులు జాషువా, సామ్సన్, రమణ, శివ వైసీపీ నాయకులు మనోజ్ కుమార్, పలు దళిత సంఘాల ప్రతినిధులు, దళిత నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పథకానికి అనారోగ్యం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకం అనారోగ్యం పాలైందని కాంగ్రెస్ ఎఐసిసి ప్రతినిధి తులసిరెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం లో అనేక పథకాలు అబాసుపాల య్యాయ న్నారు. మరోవైపు పసులు రైతు గోడును ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల విషయంలోను ముఖ్యమంత్రి జగన్ మాటతప్పారని ఆరోపించారు. పేదలకు కూడా ఉచితంగా ఖరీదైన వైద్యం అందించాలన్న సదుద్దేశంతో 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. కాని జగన్ పాలనలో ఆ లక్ష్యం నెరవేరలేదని విమర్శించారు. 2022 సెప్టెంబరు నుంచి నెట్ ఆసుపత్రులకు బిల్లులు చెల్లించలేన్నారు. దాదాపు 2200 నెట్‌వర్క్ ఆసుపత్రులున్నాయని తెలిపారు. వీటికి సుమారు రూ.750కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటి పర్యవసానంగా ఆసుపత్రి యాజమాన్యం సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో కొన్ని నెట్‌వర్క్ ఆసుపత్రులను ఆరోగ్యశ్రీ పథకం కింద వచ్చే రోగులను చేర్చుకోలేదని తెలిపారు. వీటికి సంబంధించి వెంటనే పెండింగ్‌లో ఉన్న రూ.750కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే పసుపు రైతులకు కనీస మద్దతు ధర చెల్లిస్తూ అగ్రిగోల్డ్ బాధితులను వెంటనే ఆదుకోవాలని కాంగ్రెస్‌పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నట్లు తులసిరెడ్డి వెల్లడించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఈ నెల 13వ తేదీ జరగనున్న శాసనమండలి ఎన్నికలకు సంబందించి స్థానికంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమీషనర్ పగడాల జగన్నాథ్ గురువారం పరిశీలిం చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబందించి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబందించి మెయిన్ బజారులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీటి పరిసరాలను పరిశీలిం చిన కమీషనర్ పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి ఏర్పాటు వంటి అంశాలపై సంబందిత అధికారులకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాల్‌మెంట్ ఏఈ సందీప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, శానిటరీ కార్యదర్శులు శ్రీదేవి, చంద్రావతి, ప్రధానోపాధ్యాయులు బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

విశాలాంధ్ర - కమలాపురం : కడప యోగి వేమన విశ్వవిద్యాలయంలో కళాశాల క్రీడా పోటీలలో ప్రతిభ కనబరచిన స్థానిక సియస్‌యస్ఆర్ యస్ఆర్ ఆర్ఎమ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో డి. సుధా గౌరి (సెకండు బి. కామ్), ఏ. శివ ప్రత్యుష (థర్డ్ బి. కామ్) పి. ప్రభుదేవ (సెకండు బి. కామ్), ఎ. సుధీర్ కుమార్ (థర్డ్ బి.ఏ) జి. నాయబ్ రసూల్ (సెకండ్ బి.యస్సీ) జి. రవి శంకర్‌లు వివిధ స్థానాలలో విజేతలుగా నిలిచారు. రైఫిల్ షూటింగ్ విభాగంలో ఎం.నాగరాజు రెండవ స్థానంలో నిలిచారు. వీరిని ఆ కళాశాల ప్రిన్సిపాల్ సి.వి. రాజగోపాల రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత క్రీడా పోటీలలో ప్రథమ స్థానాలు నుంచి కళాశాలకు గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ డా. పి. కృష్ణ ఫీజికల్ డైరెక్టర్ బి. నరహరి, జిమ్ మాస్టర్ సుమన్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలి

తహశీల్దార్‌కు పింఛన్‌దారుల వినతి

విశాలాంధ్ర-పులివెందుల: అపత్రంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డికి అలాగే సబ్ ట్రెజరీ అధికారికి గురువారం పింఛన్‌దారులు విన్నవించారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోషియేషన్, గుంటూరు పింఛనుదారుల కోరుతూ దశలవారీ పోరాటంలో భాగంగా ప్రభుత్వానికి అధికారుల ద్వారా వినతి పత్రం సమర్పించినట్లు పింఛన్‌దారులు వెల్లడించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు సంభందించి పలు అపరిష్కృత సమస్యలలో కనీసం ఈ క్రింద తెలిపిన కొన్ని ముఖ్యమైన సమస్యలనైనా సత్వరం పరిష్కరించాలని కోతున్నామన్నారు. వినతిపత్రంలో సమర్పించిన వివరాలిలావున్నా యి. పెన్షనర్లకు ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు 01-07-2018 నుండి బకాయి ఉన్న డి.ఆర్ అరియర్లు సత్వరం చెల్లించాలి.. అరియర్లతోబాటు ప్రస్తుతం బకాయి ఉన్న డిఆర్ విడుదలకు ఉత్తర్వులు జారీ చేయాలి. 11వ పిఆర్‌సి అరియర్లు వేంటనే చెల్లించాలి. పెన్షనర్లకు పే ఫిక్సేషన్ స్టేట్మెంట్స్ ఇవ్వాలి..11వ పిఆర్‌సి లో ఉన్న పలు అసంబద్ధతలు సవరణకు అనామలీస్ కమిటి ఏర్పాటు చేయాలి. డి. 1-7-2023 నుండి నూతన వేతన సవరణలు అమలు చేయవలసి ఉన్నందున తక్షణం 12 వ పే కమీషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయాలి. ఇటీవల కాలం లో పెన్షన్లు చెల్లింపులో తీవ్రజాప్యం జరుగుతున్నందున పెన్షనర్లు ప్రతీనెల పెన్షన్ కోసం ఎదురుచూడడంతో తీవ్ర మానసిక వత్తిడికి గురవుతున్నారు. కనుక ప్రతీనెల ఒకటవతేదీన పెన్షన్ జమ చేసేలా ఏర్పాట్లు చేయాలి. హెల్త్ కార్డులపై కేష్ లెస్ ట్రీట్ మెంట్ అన్ని హాస్పటల్స్ లో సమస్త వ్యాధులకు అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలి. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్స్ తక్షణం చెల్లింపులు చెయ్యాలి. ప్రభుత్వ ఉత్తర్వులు 492 మెడికల్ హెల్త్ డిపార్టుమెంటు తేది. 27-09-2018 మేరకు ప్రతీ సంవత్సరం పెన్షనర్లు, వారికుటుంబ సభ్యులకు మాస్టర్ హెల్త్ చెకప్ అమలు చేయాలి.పెన్షనర్లకు సంబంధించిన నాన్ ఫైనాన్షియల్ ఐటమ్స్ విషయములన్నియు సి.ఎఫ్.యం.యస్. / హెర్బ్‌కు సంబంధం లేకుండా సంబంధిత సబ్ ట్రెజరీలలోనే పూర్తి చేయునట్లు తగు చర్యలు చేపట్టాలి. వినతిపత్రం సమర్పించిన వారిలో పులివెందుల పింఛనర్ల అసోసియేషన్ సభ్యులు ఉన్నారు

విశాలాంధ్ర
అన్నమయ్య జిల్లా



బ్యాలెట్ బాక్సులు ట్రాన్స్పోర్టేషన్ పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: మార్చి 13వ తేదీ జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రిసెప్షన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్ ల ట్రాన్స్పోర్టేషన్ పగడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో బ్యాలెట్ బాక్స్ లు మరియు జంబో బాక్స్ లు ఓపెన్, క్లోజ్ చేయడం, బ్యాలెట్ బాక్స్ ట్రాన్స్పోర్టేషన్ పై అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టబద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్నమయ్య జిల్లాలో 16 రూట్లు ఉన్నాయన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ స్టేషన్ లకు బ్యాలెట్ బాక్సులు పగడ్బందీగా తరలించాలన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులు, జంబో బాక్స్ లకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో జాగ్రత్తగా సీల్ వేయాలన్నారు. ప్రతి బ్యాలెట్ బాక్స్ కు సీరియల్ నెంబర్, పోలింగ్ స్టేషన్ వివరాలు తప్పకుండా ఉండాలన్నారు. బ్యాలెట్ బాక్స్ లు ఓపెన్, క్లోజ్ చేయడంపై పోలింగ్ అధికారులు సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులో జంబో బాక్సులు ట్రాన్స్పోర్టేషన్ గురించి సంబంధిత అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియ, డి ఆర్ ఓ సత్యనారాయణ, ఎన్నికల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మాతమ్మ విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర-గాలివీడు: మండలంలోని అరవీడు గ్రామం బురుజుపల్లి హరిజనవాడలో గాలివీడు ఆలయాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ మాతమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.వేదపండితులు నాగఫణి కిషోర్ శర్మ ,సాయి బాబు చేతుల మీదుగా యజ్ఞ యాగాదులు నిర్వహించి శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్న భక్తులు, ప్రజలకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆటో బైక్ ఢీ...ఒకరికి గాయాలు

విశాలాంధ్ర-గాలివీడు: ఆటో బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇడగొట్టు రెడ్డప్ప తీవ్రంగా గాయ పడ్డాడు. స్థానికుల కథనం మేరకు గాలివీడు గ్రామం గంగ బోయిన వడ్డెపల్లె కు చెందిన ఇడగొట్టు రెడ్డప్ప ద్విచక్రవాహనంపై గాలివీడుకు వస్తుండగా మార్గమధ్యంలో ఆటో ఢీకొనడం తో రెడ్డప్పకు కాలు విరిగినట్లుగా సమాచారం.వెంటనే 108 కు సమాచారం ఇవ్వడంతో పైలట్లు రామంజులు, ఖాదర్ బాష సహాయంతో హుటా హుటిన బాధితున్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర -రామసముద్రం : మండలంలోని వూలపాడు పంచాయతీ నరసాపురం గ్రామంలో గురువారం సింగల్ విండో అధ్యక్షుడు కొత్తూరు కేశవరెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు ప్రకాశం నెల్లూరు చిత్తూరు పట్టబద్రుల వైకాపా అభ్యర్థి శ్యాం ప్రసాద్ రెడ్డి కి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు నరసాపురం గ్రామంలోని పట్టపద్రులకు ఓటు వేయాలని కోరారు ఆయన వెంట వూలపాడు మాజీ సర్పంచ్ సిపి రమణప్ప, కనగానిో గవన్న విజయ్ కుమార్ రెడ్డి, చంగప్ప పాల్గొన్నారు.

5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-రామాపురం : ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2023- 24 విద్యా సంవత్సరం గాను 5వ తరగతి. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ లో ప్రవేశం కొరకు అర్హులైన విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలల్లో 5 నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లీష్ మీడియంలోనే విద్యా బోధన ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎంపీసీ బైపిసి కాలీలకు సంబంధించి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన బాలురు నుండి ఈనెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23వ తేదీ ఉదయం 10 నుంచి 12 వరకు ఉంటుందని పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : 10 ఇంటర్ తరగతుల్లో విద్యార్థుల కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రేఖ పేర్కొన్నారు గురువారం మోడల్ స్కూల్లో ఇంటర్ విద్యార్థుల ఫేర్వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2015 నుంచి ఏపీ మోడల్ కాలేజీలు మంచి ఫలితాలు సాధించి ట్రిపుల్ ఐఐటీలో ఎంతమంది విద్యార్థులు ఇంజనీరింగ్ చేస్తున్నారని అంతేగాకుండా అగ్రికల్చర్ ఆర్టికల్చర్ కోర్సుల్లో మంచి ఫలితాలు సాధించి ఎంతోమంది ఉద్యోగాలు సంపాదించాలని ఆమన్నారు. ఈ ఏడాది కూడా 10 ఇంటర్నల్ మంచి ఫలితాలు సాధించి కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆమె సూచించారు అనంతరం ఇంటర్ మొదటి రెండో సంవత్సరం విద్యార్థులకు ప్రిన్సిపల్ పరీక్ష మెటీరియల్ అందజేశారు. అనంతరం ఇంటర్మీడియట్ విద్యార్థులు నాటకాలు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ అధ్యాపకులు శివశంకర్ రెడ్డి జమ్రుద్ బేగం సుజాతమ్మ శ్రీకళ నిత్య పూజయా సుధాకర్ శ్రీనివాసులు మురళి నాయక్ ఆసిఫా భాను సుమియా భారతి అరుణ్ కుమారి పిడి సోమశేఖర్ నాయక్ ఉమామహేశ్వరి సుధీర్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ ఇంటర్ కాలేజియట్ పురస్కారాలు అందుకున్న మిట్స్ విద్యార్థులు

విశాలాంధ్ర-మదనపల్లి: అంగళ్ళు సమీపం లో ని మిట్స్ కళాశాల విద్యార్థులు 11వ జె.యెన్.టీ.యు అనంతపూర్ (జేఎన్టీయూ) ఇంటర్ కాలేజియేట్ పోటీలలో ప్రతిభ కనపరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. గూడూరు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పోటీలలో బాస్కెట్‌బాల్ పురుషుల విజేతలు మరియు మహిళల టెన్నికాయిట్ డబుల్స్ విజేత మహిళల సింగిల్స్ టెన్నికాయిట్ విజేతలు గా నిలిచినట్లు ఆయన అన్నారు. జె.యెన్.టి.యు అనంతపూర్ (జెఎన్‌టియు)కు అనుబంధంగా ఉన్న 67 కళాశాలల నుండి సుమారు 2000 మంది విద్యార్థులు పాల్గొన్నారు అని, అందులో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరచినట్లు ఆయన అన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులు ను కళాశాల కరెస్పాండెట్ డాక్టర్. యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్, ఫిసికల్ డైరెక్టర్ దామోదరన్ తదితరులు అభినందనలు తెలియాజేశారు..

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ కళ్యాణ మండపంలోని ముత్యాల పందిరిలో వేద మంత్రాల సాక్షిగా మూడు ముళ్ల బంధంతో అశేష పెద్దల నడుమ వైవాహిక జీవితంలోకి అడిగిడుతున్న నూతన వధూ వరులు గిరి బాబు, ఉమలను ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొర ముట్ల శ్రీనివాసులు ఆయన అనుచర వర్గీయు లు సింగమాల సభాపతి, రాజ గోపాల్, డివి రమణ, దామర్ల సిద్ధయ్య, మారే వెంకటయ్య, కంచర్ల రమణారెడ్డి, కాలవ రవీంద్ర, సింగమాల రాజామాణిక్యం, నరసింహులు, చెంచురత్నం, మద్దెల సుబ్బరాయుడు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, సహాయ కార్యదర్శి గంగాపూరి సుధా కర్, నాగేశ్వరరావు, వధూవరుల బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు తదితరులు పెద్ద ఎత్తున తరలివచ్చి నూతన వధూవరులపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

విద్యకు ఆభరణం క్రమశిక్షణ

విశాలాంధ్ర-గాలివీడు: విద్యకు ఆభరణం క్రమశిక్షణ అని ఎంపిడిఓ శేఖర్ నాయక్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక గౌతమ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవం ఉత్సవాల్లో భాగంగా ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించినపుడే భావిభారత పౌరులుగా తీర్చిదిద్దబడతారన్నారు.కష్టపడి చదివితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు వుంటుందని,విద్య జీవన గమనాన్ని నిర్దేశిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం షింటో ఇమ్మానియల్,సైజు థామస్,పాల్గొన్నారు..

జీవితంపై విరక్తితో టైలర్ ఆత్మహత్య

విశాలాంధ్ర-మదనపల్లి : జీవితంపై విరక్తితో ఓ టైలర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మదనపల్లి మండలంలో జరిగింది. ఇందుకు సంబంధించి మదనపల్లి రూరల్ ఎస్సై చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి మండలం, పోతబోలు పంచాయతీ ఆరోగ్యవరం తురకపల్లిలో కాపురం ఉంటున్న దేవదానం కుమారుడు జయరాజ్(47) టైలర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్య పుష్ప కువైట్ వెళ్లడంతో తన ముగ్గురు పిల్లల్ని పోషించడం కష్టంగా మారింది. దానికి తోడు అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందడు. తన ఇంటి ఆవరణలో ఉన్న బాత్రూంలో తాడుతో గొంతుకు ఉరేసుకుని మృతి చెందాడు. పిల్లలు గమనించి గ్రామస్తుల సాయంతో మృతదేహాన్ని ఉరి నుంచి తప్పించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మారుతికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు మరమ్మతులపేరుతో రాకపోకలకు అంతరాయం.

విశాలాంధ్ర- కేవీపల్లి: మండలం గంగువారి పల్లి నుండి చెరువు కింద పల్లికి రోడ్డు మరమ్మతుల పేరుతో రాకపోకలకు అంతరాయం కల్పిస్తున్నారని చెరువు ముంధర పల్లి గ్రామస్తులు కుప్పం రవిచంద్రా రెడ్డి తెలిపారు.కేవీ పల్లి వైసీపీ ఎంపిపి ఈశ్వరమ్మ భర్త మల్లి కార్జున గ్రామస్తులను విచారించకుండా మాకు సంబంధించిన పట్టా భూముల్లో మా అనుమతి లేకుండా గంగువారి పల్లి నుండి చెరువు ముందర పల్లికి రోడ్డు మరమ్మతులు కోసం పనికి మాలిన బంక మన్ను కిలో మీటర్ పొడవునావేసి గ్రామస్తులను,ఇబ్బందికి గురి చేస్తూ, రాక పోకలకు అంతరాయం కల్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తెలుగుదేశం పార్టీ సానుభూతి పరులని వైసిపి నాయకులు ఇలాంటి కక్ష కారుణ్యాలకు పాల్పడడం తగదని హితవు పలికారు.చెరువు కింద పల్లిలో 15కుటుంబాలు ఉండగా ఎలాంటి సమాచారం లేకుండా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించి రోడ్డు మరమ్మతులు చేపట్టడం సబబు కాదని అన్నారు.మా ఇంటికి మేము వెళ్లాలన్నా వెళ్లనీ కుండా చేసున్న వైసీపీ నాయకుల దౌర్జన్యాలు పరాకాష్టకు చేరాయని విమర్శించారు.దీని మీద సంబంధిత మండల అధికారులు దృష్టి పెట్టి గ్రామస్తులకు దారి వసతి కల్పించాలని కోరారు. అలా కానీ పక్షంలో గ్రామస్తులకు దారి వసతి కోసం కోర్టుకు ఆశ్రాయించాల్సి ఉంటుందని తెలిపారు.

సామాజిక తనిఖీ రూపంలో వ్యాపారం

విశాలాంధ్ర-పీలేరు:- పీలేరు నియోజకవర్గం కె.విపల్లి మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా రోజువారి కూలీలకు ప్రతిరోజు పని కల్పించాలని అటువంటి ఉద్దేశంతో అనేక రకాల పనుల ద్వారా పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందరికీ ఉపాధి కల్పించాలని నిర్వహించడం జరుగుతోంది ఈ యొక్క కార్యక్రమంలో ప్రతి గ్రామంలో రాజకీయ ఆర్థిక అంగ బలం కుల బలం కలిగినటువంటి ప్రత్యేకమైనటువంటి వ్యక్తులకు మాత్రమే గ్రామీణ స్థాయిలో ఉన్నటువంటి ఫీల్డ్ అసిస్టెంట్లు ,టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, ప్రాజెక్ట్ ఆఫీసర్స్ (%రా%) లు పనులు మంజూరులో జాబ్ కార్డ్ హోల్డర్స్ సంబంధం లేకుండా బిపిఎల్ పరిధిలోని పేదలను పరిగణలోకి తీసుకోకుండా ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించకుండా పనుల కోసం అనేకమంది రెక్కాడితే గాని డొక్కాడక విలవిలలాడుతుంటే ప్రభుత్వాలు యొక్క ఉద్దేశాన్ని పూర్తిగా విస్మరిస్తూ సంబంధిత శాఖలో పనిచేస్తున్నటువంటి గ్రామ మండల స్థాయి అధికారులు వారి యొక్క ముడుపులే ప్రధానదేంగా ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా విస్మరిస్తూ జెసిబిల ద్వారా చేసిన పనులకు బిల్లులు చేస్తూ, పనులు లేకపోయినా వాటికి గతంలో చేసిన పనులను చూపిస్తూ ఫోటోలు మార్ఫింగ్ చేస్తున్నారని అన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఏసీబీ వలలో చిక్కిన అవినీతి విఆర్ఓ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అవినీతికి పాల్పడ్డ గ్రామ రెవెన్యూ అధికారి (వి ఆర్ ఓ) లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారుల వలలో చిక్కుకున్నాడు. అన్నమయ్య జిల్లా రాయచోటి మండల పరిధిలోని మాధవరం వి అర్ ఓ పఠాన్ రెహమాన్ ఖాన్ గురువారం మాధవరం -2 సచివాలయం వద్ద రూ 5000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ కంజాక్షన్ ఆ వివరాలను తెలియజేశారు. రాయచోటి మండల పరిధిలోని కాటినేని వారి పల్లె కు చెందిన కాటినేని నీలవతి అనే మహిళ తన వ్యవసాయ పొలం సర్వే నెంబర్ 575 లో వున్న భూమిని ముటేషన్,ఆన్లైన్,పట్టాదారు పాసుపుస్తకం కోసం ధరకాస్తు చేసుకొంది. సంబంధిత వి అర్ ఓ పఠాన్ రెహమాన్ ఖాన్ ఆమెను రూ 5000 లంచం డిమాండ్ చేశారు. బాధితురాలు నీలావతి ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. గురువారం మాధవరం -2 సచివాలయం వద్ద బాధితురాలు నీలావతి దగ్గర వి అర్ ఓ పఠాన్ రెహమాన్ ఖాన్ రూ 5000 లంచం తీసుకుంటూ వుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ అధికారులు వివిధ పనుల నిమిత్తం లంచం అడిగితే స్పందన 14400 టోల్ ఫ్రీ నెంబర్ కు లేదా 08562-244637, 9440446191, 9440446100 తదితర పొన్ నెంబర్ లకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు, వివరాలు తెలిపారు. అవినీతిని నిర్మూలించేందుకు ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని ఆయన తెలియజేశారు.

పకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడి

విశాలాంధ్ర-రామాపురం : కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా పకృతి వ్యవసాయాన్ని పెంపొందించడం అనే పథకంలో 2022- 23 సంవత్సరానికి సంబంధించి పకృతి వ్యవసాయంపై సాగు చేసే రైతులకు అవగాహన తెలుపుతూ ఈ పకృతి వ్యవసాయం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చునని ఏవో నాగమణి అన్నారు. మండలంలోని రాచపల్లి పంచాయతీ గంగనేరుకు చెందిన రైతు రామాంజులు రెడ్డి పకృతి వ్యవసాయంతో సాగు చేసిన వేరుశనగ పంటను గురువారం ఆమె పరిశీలిం చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పకృతి వ్యవసాయం అనుసరిం చడానికి రైతులు ఉత్సాహం చూపాలని దీర్ఘకాలిక దిగుబడిలో లాభాలు పొందవచ్చునని తెలిపారు. రైతులు పకృతి వ్యవసాయాల కు సహకరించాల న్నారు. విజ్ఞాన యాత్రలు శిక్షణ కార్యక్రమాలు క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించా మని ఆమె అన్నారు. పలు రకాల భూసార పరీక్షల ఆవశ్యకతను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ, డాక్టర్ సి.ప్రత్యూష, డాక్టర్ కే సాయి మహేశ్వరి, మండల యాంకరు వెంకట రామిరెడ్డి. ఉత్తమ రైతు శ్రీదేవి. రైతులు రామిరెడ్డి ధర్మారెడ్డి నాగరాజు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కత్తి నరసింహారెడ్డిని ఎంఎల్‌సిగా గెలిపించుకుందాం

విశాలాంధ్ర-చిట్వేలి : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు లను గెలిపించుకుందాం నిజాయితీ నిబద్ధతకు అండగా నిలుద్దాం సిపిఐ అన్నమయ్య జిల్లా చిట్వేల్ మండలంలో ఎమ్మెల్సీ విస్తృత ప్రసారం సందర్భంగా చిట్వేల్ మండల కార్యదర్శి తిప్పన ప్రసాద్ వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి కేశం ప్రసాద్, చిట్వేల్ సిపిఐ మండల సహాయ కార్యదర్శి సామా గంగయ్య వారు మాట్లాడుతూ మార్చి 13న జరగబోయే పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అన్ని వర్గాల ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించే వ్యక్తులు బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్య ర్థులు కత్తి నరసింహారెడ్డి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ స్థానిక రైల్వే కోడూరు నియోజకవర్గ లో ఉన్న ప్రైవేట్ కళాశాలలు విస్తృత ప్రచారం నిర్వహించారు.

కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన ఎస్వీయు విద్యార్థులు

విశాలాంధ్ర-కలికిరి: తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల అగ్రికల్చర్ బిఎస్సి ద్వితీయ సంవత్సరం జోనల్ అగ్రికల్చర్ టూర్ లో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం కలికిరిను గురువారం సందర్శించారు. విద్యార్థులకు మామిడి నర్సరీ మొక్కల పెంపకం, నిమ్మ మొక్కల పెంపకం, వివిధ పూల నారు పెంపకం మరియు కూరగాయల నారు పెంపకం గూర్చి ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఏ శ్రీనివాసులు వివరించారు. విద్యార్థులు కేవికే నర్సెరి ని సందర్శించారు. అధెవిధంగా వివిధ జాతుల కొల్లను గూర్చి, ఆర్టిఫీషియల్ ఎగ్ ఇంకుబెటర్, వెర్మికొంపోస్ట్, మరియు అజోల్ల గూర్చి పశువైద్య శాస్త్రవేత్త వివరిచారు. అగ్రికల్చర్ కళాశాల ఉపాధ్యాయులు డా.పి. అరుణశ్రీ, డా. బి. సంతోష్ మరియు డా. ఏ.ఆర్. నిర్మల్ కుమార్ పాల్గొన్నారు.

ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : 2023 - 24 విద్యాసంస్థలకు సంబంధించిన ఐదవ తరగతి ఇంటర్మీడియట్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురకల బాలికల పాఠశాలలో ప్రవేశ కొరకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ తెలిపారు. దరఖాస్తులు ఆన్లైన్లో చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 24 తేదీ లోపు స్థానిక గురుకుల పాఠశాలలో అప్పగించాలన్నారు. ఐదో తరగతిలో ఎస్సీ 70 బీసీ నాలుగు ఎస్టీ 15 ఓసి ఒకటి చొప్పున ఖాళీలు ఉన్నాయని ఇంటర్మీడియట్లో సంవత్సరం ఎంపీసీ 40 సీట్లు బైపిసిఎల్ సీట్లు ఉన్నాయని ఆమె తెలిపారు. 4వ తరగతి పూర్తయిన వారు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను పాఠశాలలో అప్పగించాలని ఆమె తెలిపారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి

జాయింట్ కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జాయింట్ కలెక్టర్ తస్లీమ్ అన్సారియా వారికి పోలింగ్ బూత్ల వద్ద పటిష్టమైన బందోబస్తు మరియు సీసీ కెమెరాలు, స్థానికేతరుల ద్వారా వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా వినతి పత్రం అంద చేయడం జరిగింది. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు దొంగ ఓటర్లను పిలిపించుకుని ఓట్లు వేసేందుకు సిద్ధమయ్యారని పట్టభద్రులు మరియు టీచర్లు జాగ్రత్తగా వైసిపి నాయకుల యొక్క ఆగడాలను తిప్పుకొట్టి వారి ఓటును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు . తిరుపతి నందు వైసిపి నాయకులు ఐదవ తరగతి,పదవ తరగతి పాసైన వారికి ఓట్లు ఎక్కించడము వీరి యొక్క దుర్మార్గపు చర్యలకు తిరుపతి ఘటన సాక్షాత్తు నిదర్శనం అన్నారు. ఎన్నికల అధికారికి రాయచోటి నియోజకవర్గం మొత్తము నందు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత మైన వాతావర ణంలో పట్టభద్రులు మరియు టీచర్లు వారి సొంత ఓటును సద్వినియోగపరుచుకునే లాగా దొంగ ఓట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు అనపర్తి వెంకట నారాయణ (జయ) , మరో పరిశీలకులు దాసరి ఆంజనేయులు గారు పాల్గొన్నారు. రాయచోటి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లా బకేష్ జనసేన రాయచోటి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి రామ్ మరియు సిపిఐ నాయకులు రామంజి బీఎస్పీ పార్టీ నాయకులు పై అంశానికి మద్దతు పలికారు.

మహిళకు రక్తదానం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రక్తదానం ప్రాణదానమని ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ అన్నారు . అన్నమయ్య జిల్లా రాయచోటి ప్రక్కన సుండుపల్లె మండలం కి చెందిన పవిత్ర అనే స్త్రీ కి రక్తము అవసరం గాక డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్‌ని సంప్రదించగా అర్షద్ మరియు బిటెక్ విద్యార్థి చే ఏ పాజిటివ్ రక్తదానము చేయించిన హెల్పింగ్ హాండ్స్ చైర్మన్ బ్లడ్ మోటివేటర్ డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ గారు మరియు కమిటీ సభ్యులు మహమ్మద్ అర్షద్ పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించండి: సీపీఐ

విశాలాంధ్ర-సుండుపల్లె : వైకాపా బలపరిచే అభ్యర్థులను చిత్తు చిత్తుగా ఓడించి పట్టభద్రులకు పోటీ చేస్తున్న ఉద్యమ నాయకులైనటువంటి పోతుల నాగరాజు మరియు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డిని గెలిపించాలని,సుండుపల్లి మండలంలోని పట్టభద్రులకు, పలు సచివాలయాలలో కరపత్రాలు ఇస్తూ ప్రచారం నిర్వహించామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు విశ్వనాథ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచిన వెన్నపూస గోపాలరెడ్డి ఏనాడైనా శాసనమండిలో నిరుద్యోగుల పక్షాన గాని శాస్త్రీయ విద్యా విధానంపైన ఏనాడు కూడా మాట్లాడలేదని శాసన మండలికి అనేక సార్లు డుమ్మా కొట్టిన వ్యక్తి వెన్నపూస గోపాలరెడ్డి అని విమర్శించారు. అలాంటి వ్యక్తి యొక్క కుమారుడు మళ్ళీ వెన్నపూస రవీంద్రా రెడ్డికి ఓటు అడిగేటువంటి నైతిక హక్కు లేదని వైకాపా బలపరిచే వ్యక్తికి చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఓట్లు వేపించుకొని గెలుచుకున్న వెన్నుపూస గోపాలరెడ్డి ఏనాడైనా సుండుపల్లెకు వచ్చాడా సుండుపల్లె నిరుద్యోగులతో ఒక సమావేశమైన ఏర్పాటు చేశాడా అని ప్రశ్నించారు. కేవలం డబ్బు ఉన్న అహంకారంతో మాత్రమే ఓట్లు అడుగుతున్నారని నిరుద్యోగులను కొనేస్తామని మాట్లాడుతున్నారని.. ఈనెల 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో నిరుద్యోగులు, విద్యావంతులు పట్టభద్రుల సత్తా ఏంటో వెన్నపూస రవీంద్రారెడ్డికి చూపిస్తారని తెలిపారు.

మందులపై 90 శాతం రాయితీ ఇవ్వాలి

విశాలాంధ్ర -రాజంపేట: ఆరోగ్య నిమిత్తం కొనేటటువంటి మందులపై కేంద్ర ప్రభుత్వం 90 శాతం రాయితీ ఇవ్వాలని రైతు సంఘం నాయకులు మలిశెట్టి జతిన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కొన్ని కారణాలవల్ల చాలామంది ప్రజలు ఆరోగ్య నిమిత్తం ప్రైవేట్ హాస్పిటలకు పోవడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ వైద్యాధికారులు ఆరోగ్య పరిస్థితిని బట్టి డాక్టర్లు మందులు సూచించడం జరుగుతుందన్నారు. అయితే ఈ దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల నిమిత్తం కోసం కొనవలసినటువంటి మందులకు వ్యక్తులు ప్రతి నెల వేల రూపాయల్లో ఖర్చు చేయాల్సినటువంటి బాధాకరమైన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పేద మధ్య తరగతి ప్రజలు ఆదాయం పెరగలేదు కానీ ఖర్చులు, ధరలు మన దేశంలో పెరిగాయన్నారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి ఈ ఆరోగ్య నిమిత్తం కొనేటటువంటి దీర్ఘకాలిక, అత్యవసర పిల్లలకు సంబంధించిన అన్ని మందులపైన (పేటెంట్ రైట్స్ ఉన్న మందుల పైన కూడా 90 శాతం రాయితీ ఇచ్చి పేద మరియు మధ్య తరగతి ప్రజలను ఆదుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాంగోపాల్ రెడ్డిని గెలిపించాలి

విశాలాంధ్ర-సుండుపల్లె : తెలుగుదేశం పార్టీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ని 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకుడు చమర్తి జగన్ మోహన్ రాజు కోరారు. సుండుపల్లి మండలంలోని గుండ్లపల్లి గ్రామపంచాయతీలో పట్టబద్దుల వద్దకు వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేస్తే మరో ఆరు సంవత్సరాల పాటు నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు లేక ఖాళీగా ఉండాలని అన్నారు. ప్రభుత్వ పాలనలో ఏదైనా మంచి జరిగిందా అని పట్టభద్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శివరాం నాయుడు, చంద్రశేఖర్ రాజు, సురేష్ నాయుడు, వేములయ్య స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహనా ర్యాలీ

విశాలాంధ్ర-లింగాల: లింగాలలో గురువారం వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో నవధాన్యాల సాగుపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో 30 రకాల ధాన్యాలను బంక మట్టి,ఘనజీవామృతం, కట్టెల బూడిదలను 10కిలోల చొప్పున తీసుకొని తగినంత బీజామృతంతో విత్తనాలను, ప్రతి రకం విడివిడిగా గోనెసంచిమీద పోసుకొని విత్తనాల మీద బీజామృతం పోస్తూ బంక మట్టిని ఒక పొరగా పోసి సంచిని అటు ఇటు కదిలిస్తే విత్తనాల మీద బంక మట్టి చుట్టూ పొరలాగా అంటుకుంటుందన్నారు. తరువాత రెండవ పొరగా ఘనజీవామృతం ఎరువును పైన పోస్తూ సంచిని అటు ఇటు ఊపాలని, అలాగే మూడో పొరగా కట్టెల బూడిదను చల్లి అటు ఇటు తిప్పాలన్నారు. ఈ మూడు రకాల ఇన్పుట్స్ విత్తనాలు చుట్టూ పొరగా ఏర్పడిన తరువాత నీడలో బాగా ఆరబెట్టాలని విత్తనగుడికలు తయారైనట్టే, ఈ గుళికలని చీనీ చెట్ల మధ్యలోనూ, బీడు భూములలోనూ వట్టి నేలలలో ముందుగా విత్తుకోవడం వలన ఎప్పుడు వర్షం వచ్చినా కూడా విత్తనం చెడిపోకుండా, పక్షులు చీమలు తిని పోకుండా, విత్తనం మీద పోసిన మట్టి, బూడిద, ఘనజీవామృతంలు కాపాడుతాయన్నారు. అలాగే భూమినుండి వచ్చే చీడపీడలు తట్టుకొంటాయని తెలియజేశారు. ఈ గుళికలు మే జూన్ నెలలో వేసుకోవడం వలన వర్షం ఎప్పుడు వచ్చినా ఆరోగ్యకరమైన మొలకలు వస్తాయన్నారు. భూమిలో లోపించినటువంటి సూక్ష్మ స్థూల పోషకాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. రసాయనిక ఎరువులుకు బదులుగా నవధాన్యాలు వేసుకోవాలని భూమిలో ఈ నవధాన్యాలు వేసుకోవడం వలన మంచి శక్తిని అంది స్తాయన్నారు. ఈ నవధాన్యాలను వేసుకున్న రైతులు పైన ఉన్నటువంటి పైరును 45 రోజుల వరకు ఉంచి, భూమిలో కలయదున్నడం లేదా తమ పశువులకు మేతగా వాడుకోవచ్చన్నారు. నవధాన్యాల వేర్లలో భూమికి కావలసినటువంటి అన్ని పోషకాలు ఉంటాయని కాబట్టి, వేరు వ్యవస్థను భూమిలో దున్నుకోవడం చాలా ఉత్తమమన్నారు. ఎన్ని రకాల విత్తనాలు వేసుకోవాలి, ఏ ఏ రకాల విత్తనాలు కావాలనే విషయాన్ని అడిషనల్ డీపీఎం వసంత కుమారి, ఎంప్టీ భాస్కర్ రెడ్డిలు తహశీల్దార్ శేషారెడ్డి, ఎండిఓ సురేంద్రనాథ్, అగ్రికల్చర్ ఆఫీసర్ రమేష్ నాయక్, ఏపీఎం (వైయస్సార్ క్రాంతిపథం) రామాంజినేయులు, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీసీలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నారాలోకేష్ యువగళం పాదయాత్ర లో శభాష్ అనిపించుకున్న హనీఫ్ టీం

విశాలాంధ్ర-కలికిరి(పీలేరు): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి శారథ్యం లో నిర్వహించబడిన యువగలం పాదయాత్రకు సంగీభావం తెలుపుతూ టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి హనీఫ్ టీం సభ్యులు అందరూ పీలేరు నియోజకవర్గం నుండి యువగలం పాదయాత్రలో పాల్గొని పీలేరు నుండి సిటియం వరకు ప్రతిరోజూ పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేసినందుకు టీం కృషిని, టీం కష్టాన్ని గమనించి నారా లోకేష్ హనీఫ్ ని మరియు టీం సభ్యులందరిని శభాష్ అని ప్రశంసించినార ఇలాగే యువకులు అందరూ పార్టీ కోసం ఇదే ఉత్సహంతో పని చేయమని హనీఫ్ సందేశం ఇచ్చారు.

టీడీపీ ఎమ్మెల్సీఅభ్యర్థిని గెలిపించండి

విశాలాంధ్ర - కమలాపురం : నిరుద్యోగ యువత, అర్హులైన పట్టభద్రుల తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యూనిట్ ఇంచార్జ్, చిన్నచెప్పలి టిడిపి నాయకుడు రామ్మోహన్ రెడ్డి తెలుగు యువత మండల అధ్యక్షుడు ఎర్రబల్లి చిన్న సుబ్బారెడ్డి పార్టీ నాయకులు కోరారు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండలం పరిధిలోని చిన్న చెప్పలి, నసంతపురం, లేటపల్లి, వెంకటాపురం, పొడదుర్తి,ఎర్రబల్లె, కొత్తపల్లె, ఎల్లారెడ్డి పల్లి, చెన్నారెడ్డి పల్లి గ్రామాలలోని పట్టభద్రుల అర్హత కలిగిన అభ్యర్థులను (ఓటర్లను) ఇంటింటికి వెళ్లి టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు (1) వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రామ్ గోపాల్ రెడ్డి గెలుపుతోనే నిరుద్యోగ యువతకు మంచి భవిష్యత్తు కలిగే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరసింహ,మండల ప్రధాన కార్యదర్శి గుజ్జుల నారాయణ యాదవ్, గండి సుబ్బరాయుడు,ఎర్రబల్లి రామిరెడ్డి, ఆరోగ్య కేంద్రం మాజీ చైర్మన్ జంపాల నరసింహారెడ్డి నసంతపురం ఈశ్వరయ్య, రవి, పొడదుర్తి బాలకృష్ణ, వెంకటాపురం చెన్నక్రిష్ణ, లేటపల్లె ఎల్లారెడ్డి, బూత్ కమిటీ సభ్యుడు కరిముల్లా, రామాంజ నేయులు, లేటపల్లె భాస్కర్ రెడ్డి,చిన్న చెప్పలి బూత్ కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి, అబ్దుల్ కరీం, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నగరానికి దోమకాటు.!

- దోమల నిర్మూలనలో మున్సిపల్ యంత్రాంగం విఫలం
- అభివృద్ధి చేస్తున్నామని ప్రచారమే కానీ.. అంతా ఉత్తదే
- యాంటీ లార్వా ఆపరేషన్ ఎక్కడ.? పత్తాలేని ఫాగింగ్
- విష జ్వరాల బారిన పడుతున్న పట్టణ ప్రజానీకం

విశాలాంధ్ర -రాజంపేట: రాజంపేట మున్సిపాలిటీలో దోమలు స్వైర వ్యవహారం చేస్తున్నాయి. దీంతో పట్టణ ప్రజానీకం దోమకాటుకు గురవుతున్నారు. సాయంత్రం ఆరు గంటల అయిందంటే చాలు బయటకు రావాలంటేనే భయపడి పోతున్నారు. దోమలు ముకుమ్మడిగా దాడి చేస్తున్నాయి.ఖాళీ స్థలాలు.. పేరుకుపోయిన చెత్తాచెదారం..డ్రైనేజీ కాలవలు వాటి పున పునరుత్పత్తికి కేంద్రాలుగా తయార య్యాయి. దీంతో డ్రైనేజీ కాలవలు దోమలకు ఆవాసాలుగా తయారయ్యాయి. తద్వారా డెంగు, మలేరియా వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. నగరంలో దోమల నివారణలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.దోమల నివారణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడం.. యాంటీ లార్వా ఆపరేషన్లు ఫాగింగ్ ఊసే లేదు.పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రమే! అధికారుల చర్యలు కాగితాలలో కనిపిస్తున్నాయే గాని కార్యరూపం దాల్చడం లేదని పట్టణ ప్రజల నుండి బహిరంగంగా విమర్శలు వ్యక్తం అవుతు న్నాయి.రాజంపేట పట్టణం లో రాత్రి వేళల్లో దోమలు భయపెట్టేస్తు న్నాయి. సాయంత్రం 6 గంటలు అయిందంటే చాలు ముసురుకుంటున్నాయి. దోమల విజృం మనతో పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటి నిర్వహణకు లక్షల్లో ఖర్చు చేస్తున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్న..అవి కాగితాల్లో తప్ప క్షేత్రస్థాయిలో కాదు, దోమల నివారణకు అధికారులు చిత్తశుద్ధితో కార్యచరణ అమలు చేయకపోవడమే ఇందుకు కారణం. దోమల కారక మురికి కాలువలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో లార్వాలు చనిపోయేందుకు ప్రతివారం బైటెక్సు , మాలాదియన్ రసాయనాలు చేయాలి. లార్వాలు తినే గుంబాసియా చేపలు మురికి కాలువలో వదలాల్సి ఉండగా.. నగర పాలక సంస్థ అధికారులు ఆ మాటే మరిచారు.మురుగు కాలువల్లో ఎం ఎల్ ఆయిల్ బాల్స్ వేయాల్సి ఉన్న.. ఎక్కడ ఆదిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించలేదు. ఫాగింగ్ చేయాల్సి ఉన్నా.. తూతూ మంత్రంగా చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ: పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. కాలువల్లో ఎక్కడెక్కడ నీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది.దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి.చాలా కాలువల్లో కాలువ పూడికతో నిండి మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. కాలం గడుస్తున్న కొద్ది వివిధ శాఖల నిర్లక్ష్యం..ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం వంటి అనేక కారణాలు ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నాయి.సీజనల్ గా మాత్రమే కనిపించే దోమలు.. ఇప్పుడు సీజన్ తో సంబంధం లేకుండా వచ్చేస్తున్నాయి.ఎన్నడూ లేని పరిస్థితుల కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి.తక్కువ ఉష్ణోగ్రతల కారణంగా శరవేగంగా వృద్ధి చెందుతున్న దోమలు ప్రజలను ముప్పుతెప్పలు పెడుతున్నాయి.ఎనాఫిలిస్, క్యూలెక్స్ వంటి దోమలు పగటిపూట ఇళ్లల్లోనే మకాం వేసి రాత్రి వేళల్లో స్వైర వ్యవహారం

చేస్తున్నడంతో జనాలు వ్యాధుల బారిన పడుతు న్నారు.

అన్ని మార్గా ల్లోనూ.. దోమలను శాశ్వతంగా వదిలించుకోవడం అంత సులభం కాకపోవడంతో తాత్కాలిక ఉపశమనానికి పెట్టే ఖర్చు తెలియ కుండానే లక్షల్లో చేరిపో తుంది. అటు దోమల సైతం ప్రజలు చేస్తున్న నివారణ చర్యలను దీటుగానే ఎదుర్కొంటు న్నాయి. ఇందుకు ప్రజలు కాయిల్స్ ప్రయోగించడం, అవి పనిచేయకపోవ డంతో లిక్విడ్,మస్కిటో బాట్స్ వాడకం పెంచారు.ఇలా నగరంలో ఒక్కో కుటుంబం దోమల బెడద నుంచి తప్పించుకునేందుకు ప్రతి నెలా డబ్బులు ఖర్చు పెడుతున్నారు.

రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర-మదనపల్లి రూరల్: ఓ రైతు వ్యవసాయ పొలం వద్ద చింతకాయలు కోయడానికి కూలి పనులకు వెళ్లిన కూలి చింత చెట్టు ఎక్కి కాయలు కోస్తూ ప్రమాదవ శాత్తు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన నిమ్మనపల్లె మండలంలో గురువారం జరిగింది. ఘటనకు సంబంధించి ఆసుపత్రి అవుట్ పోస్ట్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. నిమ్మనపల్లి మండలంలోని అగ్రహారానికి చెందిన మునిరత్నం(47) ఓ రైతు వద్దకు చింతచెట్లలో కాయలు కోయడానికి కూలీగా వెళ్లాడు. అక్కడ కాయలు కోస్తుండగా ప్రమాద వశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు వైద్యం అందించారు. ప్రస్తుతం అతను పరిస్థితి ఆందోళనకరంగా ఉందని డాక్టర్లు తెలిపారు.

ఉపాధి హామీ పనుల్లో భారీగా అవకతవకలు

విశాలాంధ్ర-కేవిపల్లి: మండల కేంద్రమైన గ్యారంపల్లి మండలం గ్యారంపల్లిలో ఉపాధి హామీ పథకంలో అనేక అవకతవకులు జరిగాయని గారంపల్లె గ్రామస్తులు రెడ్డి శంకర్ రెడ్డి, ఆదినారాయణ నరేష్ రెడ్డి లు ఆరోపించారు. తమ గ్రామంలో పనులు చేయకుండా బిల్లులు చేసుకున్నారని ఆరోపణలు చేశారు. ఈ విషయంగా ఫీల్ అసిస్టెంట్ మీద స్పందన కార్యక్రమంలో కలెక్టర్కు వినతిపత్రం రెండుసార్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇందులో ఫీల్ అసిస్టెంట్ చేతివాటం ఎక్కువగా ఉందని తెలిపారు. తమకు ఇంతవరకు ఉపాధి హామీ పనుల బిల్లులు కూడా రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎవరికి తెలియకుండా ఆడిట్ చేసుకొని డిఆర్పి రెండు లక్షల 50 వేల రూపాయలు లంచం తీసుకుని వెళ్లిపోయారని రెడ్డి శంకర్ రెడ్డి కి తెల్లవారి సరికి వస్తానని చెప్పి ఇంతవరకు జాడలేదని అయితే ఇందు నిమిత్తం గ్యారంపల్లి ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ అధికారికి కూడా తెలియజేయడమైనదని వారు తెలిపారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి,పీలేరు శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి, దృష్టికి తీసుకెళ్తామని అలాగే స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి విన్నవించుకొంటామని గ్యారంపల్లి గ్రామస్తులు తెలిపారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవు

మైదుకూరు రూరల్ సీఐ నరేందర్ రెడ్డి

విశాలాంధ్ర -బ్రహ్మం గారి మఠం : మండలంలోని చౌదరివారిపల్లె పల్లె గ్రామా పొలం 280 సర్వే నెంబర్ రెండు ఎకరాల 90 సెంట్లు భూమి గత మూడు నెలల క్రితం అదే గ్రామానికి చెందిన పెద్దమనుషులు బత్తల సిద్ధయ్య బేరి అచ్చమ్మ కుమారుడు రమణారెడ్డి ఇరువు వర్గాలను పెద్దమనుషుల ద్వారా పంచాయతీ చేసుకోవడం జరిగిందని అంగీకరణలు ఒప్పందం ఒప్పుకోవడంతో రమణారెడ్డి గురువారం ఉదయం యంత్రాంగాలతో పొలం కంచ వేసుకునేందుకు ప్రయత్నించడంతో సిద్ధయ్య వారి కుటుంబ సభ్యులు బేరి రమణారెడ్డి పంచాయతీ చేసిన పెద్ద మనుషులపై దాడి చేయడం జరిగిందని దయచేసి తీవ్రంగా గాయపరచడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వర్గాలను చెదరగొట్టి గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఎక్కువ రూరల్ సీఐ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో మాట్లాడుతూ చౌదర వారి పల్లె గ్రామం రెవిన్యు పొలంలో 250 సర్వే నెంబర్లు బేరి అచ్చమ్మ పేరుతో భూ రికార్డు ఉందని మరో వ్యక్తి బత్తల పేరుతో కూడా ఉన్నట్లుగా తను కూడా ఇరువర్గాలు చర్చలు జరుగుతున్నాయని ఓ గ్రామ పెద్దలు ద్వారా పంచాయత్ చేసుకొని ఎకరా సిద్ధయ్యకి ఇచ్చేటట్లుగా పంచాయతీ జరిగాయన్నారు మరో 340 సర్వే నెంబర్లు కూడా పొలం ఉండడంతో పక్కపక్కనే ఉండేటివి అని పొలం గేట్లు వద్ద రావడంతో పెద్దలు ఒక తీర్మానం చేశారని ఆ తీర్మానం వారు అంగీకరించారు. మరో ప్రయత్నంలో బేరి రమణారెడ్డి పొలం కంచేసుకుండేందుకు వెళ్లడంతో దాడి జరగడం జరిగిందని ఈ సంబరాలు పెద్ద మనసులు ఓ వివాహ కార్యక్రమానికి వెళుతుండడంతో వారు కూడా అందలించే ప్రయత్నం చేయడంతో వారిపై కూడా దాడి చేశారని సీఐ నరేందర్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ప్రస్తుతం దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గాయపడిన వారు కూడా దాడికి చేసిన వారి ఇళ్లపై ఇంట్లో దూరి బీరువా టీవీ కొంత వస్తువులను ధ్వంసం చేయడంతో వారిపై కూడా కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే దాడి చేసిన వారిని తీసుకోవడం కొంతమంది పై కేసు నమోదు చేశామని ప్రస్తుతం 9 మంది పోలీసుల అదుపులో ఉన్నారని మరో కొంతమంది అదుపులోకి తీసుకుంటామని కేసును బ్రహ్మంగారిమఠం ఎస్సై విద్యాసాగర్ కలిసి విచారణ చేపడతామని రికార్డులను కూడా పరిశీలిస్తామని వారి తెలిపారు. మండలంలో అధికంగా భూ సమస్యలు ఉన్నాయని సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలు అధికారుల దృష్టికి కానీ పోలీసులు దృష్టికి తెచ్చి సమస్యలను పరిష్కరించకుండా విధంగా చూడాలని సొంత నిర్ణయాలు తీసుకొని దాడికి ప్రయత్నించే విధంగా చూడద్దని డబ్బులు సమస్యలు కూడా పరిష్కరించే విధంగా చూసుకోవాలన్నారు. ఇప్పటికే గ్రామాల పర్యటించి సమస్యలు పరిష్కరించే విధంగా చూసామని ప్రజలు దయచేసి దాడులకు ప్రయత్నించొద్దని పోలీస్ విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ భూ సమస్యలకు పై అధికారులకు కూడా తెలిపామన్నారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నిందితుడు అరెస్ట్

విశాలాంధ్ర-మదనపల్లి: బి.కొత్తకోటలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు టి టి ఎఫ్ ఎస్సై బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై విలేకరులతో గురువారం మాట్లాడుతూ... బి.కొత్తకోట జయశ్రీ కాలనీలో ఉంటున్న నాగరాజ (34) ఇంట్లో 48 కర్ణాటక ప్యాకెట్లు నిల్వ ఉంచి స్థానికులకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో వెళ్లి నాగరాజా ఇంటిపై దాడులు నిర్వహించి మద్యం సీజ్ చేశామని చెప్పారు. పట్టుబడిన నిందితున్ని మదనపల్లి సెబ్ పోలీస్ స్టేషన్కు తీసుకెళ్లి విచారణ అనంతరం అతనిపై అక్రమ మద్యం తరలింపు కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో ఢిల్లీ, నాగరాజా, సెరీలియా, దాము రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థి గెలుపుకోసం విస్తృత ప్రచారం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి బలపరుస్తున్న భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గ ఇన్చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు పట్టభద్రుల ఓటర్ల నివాసాలకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి బ్యాలెట్ నమూనా చూపించి కరపత్రాలు అందజేసి కోరారు.గురువారం ఓబులవారిపల్లి మండలంలోని బాలిరెడ్డిపల్లి తదితర ప్రాంతాలలో వ్యూహాత్మకంగా ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు.ఈ సందర్భంగా విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ ఓటర్ల లో అరాచక వైసిపి పై తీవ్రమైన వ్యతిరేకత ఉందన్నారు.టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తామన్నారు.టిడిపి సీనియర్ నాయకులు నాయుడోరి రమణయ్య, గుంటుమడుగు వేంకటేశ్వర రాజు, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పులెల రమేష్ బాబు,మాజీ శాప్ డైరెక్టర్ దుద్యాల జయచంద్ర,మహిళా నాయకురాలు అనితదీప్తి, మెహతాబేగం తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

దోమల నియంత్రణ మనందరి బాధ్యత

విశాలాంధ్ర-వేంపల్లె: దోమల నియంత్రణ మనందరి బాధ్యతని మలేరియా సబ్‌యూ నిట్ అధికారి సిద్దయ్య అన్నారు. వేంపల్లె మండలం తాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని టి. వెలమవారిపల్లె. ముసలిరెడ్డిపల్లె గ్రామాలలో సబ్-యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో దోమల నివారణ కోసం పైరత్రం పిచికారీ చేసి, ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి, నిల్వలున్న నీటిలో నీటి తొట్టెలలో అబేట్ పిచికారీ చేయడమైనది. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లడుతూ నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని, జ్వరాలు వచ్చినట్లు అయితే వెంటనే రక్త పరీక్షలు చేయించు కోవాలి అని. దోమకాటు వలన మలేరియా,డెంగ్యూ వ్యాధులు వస్తాయి కాబట్టి దోమ కాటుకు గురి కాకుండా దోమతెరలు వాడాలి అని, డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు అయితే పులివెందుల ఏరియా హాస్పిటల్ లో రక్తపరీక్షలు చేయించు కొని వ్యాధి నిర్ధారణ అయిన తరువాత మందులు వాడాలి అని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సిద్దయ్య అన్నారు. కార్యక్రమములో ఆరోగ్య కార్యకర్త జ్యోతి, యం.ఎల్, హెచ్.పి. ఫయాజ్, ఆశా కార్యకర్తలు వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు నుండి ప్రచారం నిషేధం: కలెక్టర్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : కడప, అనంతపురం, కర్నూలు పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల సంబంధించి.. పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు (11-3-2023 సా. 4గం. ల) నుండి ఎన్నికల నిబంధనల మేరకు ప్రచారాన్ని నిషేదిం చడమైనదని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థుల, ఆయా పార్టీల ప్రతినిధులు గమనించి స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంజనీరింగ్ పరీక్ష ఫలితాలలో శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల, మూడవ సంవత్సరం ఇంజనీరింగ్ మొదటి సెమిస్టర్ విద్యార్థినీ విద్యార్థులు, యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి అత్యుత్తమ ఫలితాలు సాధించారని శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో వై. హర్షిత 86.4 శాతం తో మొదటి ర్యాంకు జి. హర్షిత 83.2 శాతం తో రెండవ ర్యాంకు ,ఏ . వెన్నెల 83.1 శాతం తో మూడవ ర్యాంకు మరియు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగము నుంచి ఎం .పార్వతి ప్రియ 89.66 శాతం తో మొదటి ర్యాంకు ఎస్. తబుసం 88.44 శాతం తో రెండవ ర్యాంకు ఎస్. సైదా సుల్తానా 88.22శాతం తో మూడవ ర్యాంకు సాధించి యూనివర్సిటీ స్థాయిలో అగ్రగామిగా నిలిచారని తెలియజేశారు .ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ విద్యార్థులను మరియు ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను అభినందిస్తూ, ,ప్రతి ఒక్కరికి ఉద్యోగ ఉపాధి భరోసా కల్పించడానికి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకితభావంతో కృషి చేయాలని, క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి శు భహన్ , ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ ఏ. కార్తికేయన్ మరియు అధ్యాపకులు అభినందించారు.

రైతుల కోసం ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : శాసనమండలిని రాజ్యాంగ కర్తలు మేధావుల కోసం ఏర్పాటు చేశారని కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి రామచందర్ రెడ్డి అన్నారు. కళాకారులకు, ఉపాధ్యాయులకు, పట్టబద్రులకు తదితరులకు ఎమ్మెల్సీలు ఉన్నారు. కానీ రైతులకు సంబంధించి ఎమ్మెల్సీలు లేరన్నారు. రైతుల కోసం, రైతాంగ సమస్యల కోసం ప్రత్యేకంగా శాసనమండలిలో ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలని ఎన్నికల కమిషనర్ కు, కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పాస్ బుక్ కలిగి ఉన్న రైతుల కోసం ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలని కోరారు. గురువారం కడప నగరంలో తన కార్యాలయంలో విలేకరులతో సింగారెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడారు. పశ్చిమ రాయలసీమ పట్టుబద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికలలో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఆత్మ ప్రబోధానుసారం ఓట్లు వేయాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. బిఏ, బిఈడి చేసిన గవర్నమెంట్ ఎలిమెంటరీ స్కూల్ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు ఎందుకు కల్పించలేదని ఎన్నికల కమిషన్ ను, ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కానీ బిఏ, బీఈడీ చేసినటువంటి హైస్కూల్ టీచర్లకు ఓటు హక్కు కల్పించారు. దీన్ని ఏ కొలమానంగా తీసుకున్నారో అర్థం కావడం లేదన్నారు. బిఏ, బీఈడీ చదివిన వారినా లేక టీచర్ ఉద్యోగాన్ని ప్రమాణంగా తీసుకుంటున్నారా ? ఒకవేళ టీచర్ లను ప్రమాణంగా తీసుకుంటే మరి ఎలిమెంటరీ స్కూల్ ఉపాధ్యాయులకు ఓటు హక్కు ఎందుకు కల్పించలేదు. వారు ఉపాధ్యాయులు కారా అని ప్రశ్నించారు. వారికి ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. ప్రైవేట్ హైస్కూల్లో పనిచేస్తున్న వారికి ఓటు హక్కు ఉంది. అదే ఒకటి నుంచి ఐదో తరగతి ప్రభుత్వ ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయునీలకు ఎందుకు ఓటుకు కల్పించలేదని ఎన్నికల కమిషన్ను, ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ విధానం సరి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కడపకు విచ్చేసిన ఎపిఎస్సీ కమిషన్ చైర్మన్

విశాలాంధ్ర- కడప కార్పొరేషన్: ఎపి ఎస్ సి కమీషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ గురువారం కడప పట్టణం విచ్చేశారు.ఆర్&బి గెస్ట్ హౌస్ నందు పిటిషన్ దారులు కలసి సమస్య ల మీద పిటిషన్ ఇచ్చినారు. చైర్మన్ గారు సానుకూలంగా స్పందించి అందరికీ న్యాయం చెస్తాను,అని విలేక రుల సమావేశం నిర్వహించారు.శ్రీ మారుమూడి విక్టర్ ప్రసాద్ గారికి ఎపి సఫాయి కార్మికుల సంక్షేమం,హక్కుల పరిరక్షణ అదనపు బాధ్యతలను మన ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మొహన రెడ్డి గారు అప్పగించిన సందర్భంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తరుపున శాలువాతో పూలదండలతో అభినందలు తెలుపుతూ సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణాది రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి నాగ దాసరి అజయ్ ప్రసన్న గారు మరియు కడప జిల్లా అధ్యక్షులు ఎట్టి కిరణ్ కుమార్ గారు మరియు కడప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మందపల్లి ప్రసాద్ గారు మరియు కడప జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరపల్లి సునీల్ గారు అలాగే పార్టీ అధికార ప్రతినిధి సందీప్ గారు కడప జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు మొగిలి కిషోర్ గారు మరియు ఎంప్లాయిస్ వింగ్ అధ్యక్షులు వరప్రసాద్ గారు మరియు రిపబ్లిక్ అండ్ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షులు శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి అంబేద్కర్ పురస్కార మహోత్సవం

ఎస్సీ కమిషన్ చైర్మన్ చేతుల మీదుగా 25 మంది మహిళలకు పురస్కారాలు

విశాలాంధ్ర-మదనపల్లి రూరల్: భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ధర్మపత్ని మాతా రమాబాయి స్మారక పురస్కార మహోత్సవం, బుధవారం అర్ధరాత్రి దాకా స్థానిక సిఎస్ఐ కమ్యూనిటీ హాల్ నందు ఘనంగా జరిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని, భారతీయ అంబేద్కర్ సేన (బాస్) ఈ ఉత్సవాన్ని నిర్వహించింది. బాస్ వ్యవస్థాపకుడు పీటీయం శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, మదనపల్లె ఎమ్మెల్యే యం. నవాజ్ బాషాలు ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈసందర్భంగా వీరు, వివిధ రంగాలలో నిష్ణాతులైన 25 మంది మహిళా మణులను దుశ్శాలువలతో సత్కరించి, వారికి జ్ఞాపికలను అందజేసి "ది సింబల్ ఆఫ్ శాక్రిఫైస్ మాతా రమాబాయి స్మారక పురస్కారాలు" ప్రధానం చేశారు. ఈసందర్భంగా ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో మహిళలు వీరోచిత పోరాటాలు చేసి, రక్తం చిందించి, ప్రాణాలు త్యాగం చేసి హక్కులను సాధించుకున్నారని, అయితే భారతదేశంలో మాత్రం స్త్రీలు ఎలాంటి పోరాటాలు చేయకుండానే, స్త్రీలకు హక్కులు లభించాయని, అంబేద్కర్ పోరాట ఫలితంగా మహిళలకు విద్య, ఉద్యోగ, రాజకీయ హక్కుల తోపాటు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం, గౌరవం అందుబాటులోకి వచ్చాయని స్పష్టం చేశారు. ప్రపంచ పీడిత వర్గ విముక్తి పోరాటాలకు అంబేద్కర్ మహాశయుడు వెలిగించిన విప్లవ జ్యోతికి, అయన సతీమణి మాతా రమాబాయి చమురులాగా మారి, తన జీవితాన్ని భర్త ఆశయాల కోసం అంకితం చేశారని కీర్తించారు. ఆమె త్యాగాన్ని గుర్తించి ప్రపంచం ఆమెను "ది సింబల్ ఆఫ్ శాక్రిఫైస్" (త్యాగ చిహ్నం) గా కొనియాడుతోందని చెప్పారు. భారతరాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛతో ప్రతి మహిళా బాగా చదువుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే నవాజ్ బాషా మాట్లాడుతూ ప్రపంచ పీడిత వర్గ విముక్తి సిద్ధాంత కర్తగా, గొప్ప తత్వవేత్తగా, భారత రాజ్యాంగ శిల్పిగా అంబేద్కర్ అవతరించడానికి, అయన సతీమణి మాతా రమాబాయి గొప్ప త్యాగం చేశారని కీర్తించారు. 1930 డిసెంబర్ 30న అంబేద్కర్ లండన్ నుండి తన భార్య రమాబాయికి ఒక లేఖ రాశారని, దేశం పట్ల అంబేద్కర్ కున్న ప్రేమను, అంబేద్కర్ పోరాటంలో అతని భార్య రమాబాయి త్యాగాన్ని ఆ లేఖ అద్భుతంగా ఆవిష్కరించిందని, అది ప్రతీ ఒక్కరూ తప్పక చదవాల్సిన లేఖ అని స్పష్టం చేశారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా, బాస్ సంస్థ వారు మాతా రమాబాయి పేరుతో అవార్డులు అందజేయడం అభినందనీయమని చెప్పారు. ప్రతి మహిళా ఉన్నత విద్యను

అభ్యశించి, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం వహించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సభ ప్రారంభానికి ముందు నేతలు మాతా రమాబాయి చిత్రపటాన్ని పూలతో సత్కరించి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బాస్ ప్రతినిధులు పోతబోలు రెడ్డెప్ప, బురుజు లక్ష్మీనారాయణ, మునివెంకటప్ప, వై. సంపంగి, యు. గణపతి, కె.వి రమణ, ముత్యాల మోహన్, రుగట్టి రమణ, సొన్నికంటి రెడ్డెప్ప, కోనేటి దివాకర్, బాల చంద్రబాబు, పాలకుంట శ్రీనివాసులు, బయన్న, రెడ్డిప్రసాద్, మను, సూరీ, పీర్ బాషా, రవిశంకర్, సయ్యద్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

25 మందికి రమాబాయి అంబేద్కర్ అవార్డులు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, బాస్ ఆధ్వర్యంలో జరిగిన "ది సింబల్ ఆఫ్ శాక్రిఫైస్ మాతా రమాబాయి అంబేద్కర్ స్మారక పురస్కార మహోత్సవం"లో ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్న వారిలో ఉమా అమరేశ్వరి (ప్రభుత్వ బాలికల కళాశాల వాల్మీకిపురం), డాక్టర్ దీప (సీనియర్ సైంటిస్ట్ సిరికల్చర్), ఆర్. రెడ్డిరాణి (కరెస్పాండెంట్ విజయభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్), డాక్టర్ మంజుల రెడ్డి (నేషనల్ అథ్లెట్), కన్యాకుమారి (ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయం), లలితమ్మ (పోర్డ్ సంస్థ), సుభద్ర (గ్రామజ్యోతి సంస్థ), డాక్టర్ వల్లిగట్ల దివ్య (బెటర్ లైఫ్ హాస్పిటల్), లక్ష్మీదేవి (వార్డెన్ ఎస్సీ హాస్టల్), హేమావతి (వార్డెన్ బీసీ హాస్టల్) స్వర్ణలత (వార్డెన్ ఎస్సీ బాలికల హాస్టల్), రెడ్డి హరిత (లెక్చరర్ జ్ఞానాంబికా డిగ్రీ కళాశాల), సైద్ సోఫియా (విద్యార్థి), కె ఋషిత (విద్యార్థి), వి. తన్మయ (విద్యార్థి), స్నేహలత (నృత్య కారిణి), సుభాషిణి (గాయని), మార్తా సుదర్శన్, ఆవుల శ్రీదేవి రెడ్డెప్ప, పీటీయం శంకరమ్మ శివప్రసాద్, కె.వి రాధమ్మ, ఉలగనాధన్ రాధమ్మ తదితరులు కలరు. బాస్ వ్యవస్థాపకుడు పీటీయం శివప్రసాద్ తోకలిసి ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, ఎమ్మెల్యే నవాజ్ బాషాలు వీరికి అవార్డులు అందజేసి, ఘనంగా సత్కరించి, సన్మాన గ్రహీతల సేవలను, ప్రతిభను అభినందించారు.